

రంగులు చల్లే పైపులను కొనుగోలు చేస్తున్న చిన్నారులు

హోలీ ఆనందాలు తేవాలి..

నేడు రంగుల పండుగ

వాడవాడలా కామ దహనాలు

- సామగ్రి అమ్మకాలతో మార్కెట్లు కళకళ
- ఫాల్గుణ పౌర్ణమి వేళ ప్రత్యేక పూజలు, హోమాలు

6

వసంతరుతువు ఆగమనంతో వచ్చే ఆనందాల హోలీ పండుగకు అంతా సిద్ధమయ్యారు. చిన్నపెద్దా తేడా లేకుండా తమ అనుబంధాలను, ఆత్మీయతను, స్నేహాన్ని రంగులలో రంగరించి ఒకరిపై ఒకరు చల్లుకుని తమ జీవితాల్లో ఆనందాన్ని నింపాలని కోరుకోనున్నారు. గురువారం రాత్రి వాడవాడలా కాముడి దహనాలు నిర్వహించి.. శుక్రవారం రంగుల పండుగను జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక ఫాల్గుణ పౌర్ణమి వేళ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించనున్నారు. అలాగే హోలీ పర్వదినాన్ని సంతోషకరమైన రోజుగా భావించి చిన్నారులకు బహుమానంగా బిస్కెట్లతో తయారు చేసిన మాలలను అందజేస్తారు. ఈ హోలీ పండుగ రంగులు, పూజాసామగ్రి కొనుగోలుతో మార్కెట్లలో సందడి వాతావరణం కనిపించింది.

- వరంగల్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

మాయమాటలకు మోసపోవద్దు



ఫోన్‌ఇన్‌లో సందేహాలను నివృత్తి చేస్తున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్

- తెలియని యాప్‌లు, ఫోన్ కాల్స్, లింక్‌లకు స్పందించొద్దు
- సైబర్ క్రైం జరగగానే 1930 కాల్ చేయాలి
- స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కావాలి
- సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్

7

'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



హస్తంలో.. ఐక్యత సాధ్యమేనా?

ఓరుగల్లు నేతల సఖ్యతపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి

- మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలను రూపుమాపే పనిలో పార్టీ పెద్దలు
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభావం ఉండొద్దంటూ సీఎం సూచన
- మంత్రి సీతక్క నివాసంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు విందు
- పరస్పర కుశల ప్రశ్నలు, పలకరింపులతో సాగిన భేటీ
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైన 'విందు రాజకీయం'

తొలి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య సఖ్యత అంతంతమాత్రమేనన్న విషయం అందరికీ తెలిసిందే. ఎమ్మెల్యేలు, మంత్రులు మధ్య విభేదాలు రచ్చకెక్కిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. నేతల మధ్య పెరిగిన ఈ దూరం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందనే ఆందోళనలో ఉన్న పార్టీ అధిష్ఠానం.. చొరవ తీసుకుని సఖ్యత కుదిర్చే పనిలో పడింది. ఈ నేపథ్యంలో మంత్రులే చొరవ తీసుకుని ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో సూచించినట్టు సమాచారం. దీంతో మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు హైదరాబాద్‌లో విందు ఇచ్చారు. ఇప్పుడీ విషయం ఓరుగల్లు పాలిటిక్స్‌లో చర్చనీయాంశమైంది. ఇలా ఓరుగల్లు కాంగ్రెస్ నేతల మధ్య ఐక్యత తేవడంపై అధిష్ఠానం దృష్టి పెట్టగా.. నేతల మధ్య ఐక్యతపై కొమ్మాలలో జరగనున్న జాతర ప్రభ బండ్ల బల ప్రదర్శనతో స్పష్టత రానుందన్న చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అధిష్ఠానం ప్రయత్నాలు ఫలిస్తాయా? నేతల మధ్య ఐక్యత సాధ్యమవుతుందా? అన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది.

మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు..

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కొండా సురేఖ, సీతక్కలకు మంత్రులుగా అవకాశం లభించింది. వీరితో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రిగా నియమించారు. అయితే మొదటి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య గ్యాప్ తీవ్రంగా ఉంది. మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మధ్య రాజకీయ వైరం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. అంతేకాకుండా నామినేటెడ్ పదవుల విషయంలోనూ మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య వైరం ఏఐసీసీ వరకు వెళ్లింది. భద్రకాళి చెరువు పూడికతీత విషయంలోనూ ఓ మంత్రితో కొంతమంది ఎమ్మెల్యేలకు దూరం పెరిగిందనే టాక్ వినిపించింది. చివరకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒకరికి పదవి రాకుండా మరొకరు అధిష్ఠానం వద్ద ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వినిపించాయి. మొత్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య గ్యాప్ తీవ్రంగా ఉందనే విషయాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

ఎన్నికల్లో ప్రభావంపై ఆందోళన

ఉమ్మడి జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య పెరుగుతున్న దూరం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం పడే ఛాన్స్ ఉందని కాంగ్రెస్ అధిష్ఠానంతో పాటు శ్రేణులు కూడా ఆందోళనలో ఉన్నాయి. వరంగల్‌కు టెక్స్‌టైల్ పార్కు, ఐటీ సెక్టార్, ఎయిర్‌పోర్టు, భూగర్భ డ్రెయినేజీ తదితర వాటితో వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తుంటే.. నేతల మధ్య వచ్చిన గ్యాప్ క్యాడర్‌ను అయోమయానికి గురి చేస్తుందని అధిష్ఠానం భావిస్తోంది. టీపీసీసీలో పదవులతో పాటు

మిగతా 7వ పేజీలో...

కొమ్మాలలో బలప్రదర్శనకు రెడీ

కాంగ్రెస్‌లో ఐక్యతకు శుక్రవారం వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగే కొమ్మాల జాతరలో తేలనుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అనుచరులు ప్రభబండ్లు ఏర్పాటు చేస్తుండగా, వారికి దీటుగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ అనుచరులు భారీ ఎత్తున ప్రభబండ్లతో బలప్రదర్శనకు సిద్ధమవుతున్నారనే చర్చ ఉంది. రేవూరి వర్గం నుంచి కొందరు కీలక నేతలు కొండా వర్గంలో చేరటంతో రెండు వర్గాల మధ్య వార్ ము దురుతోంది. దీంతో బందోబస్తుకు 500మందికి పైగా పోలీసులను మోహరించారు. ఇక్కడే జరిగే ప్రభబండ్ల ప్రదర్శన కాంగ్రెస్‌లో నేతల ఐక్యతపై ప్రభావం పడనుందనే చర్చ జరుగుతోంది.



బిషప్‌కు స్వాగతం పలుకుతున్న క్రైస్తవులు

ప్రపంచ శాంతికి ప్రతీ ఒక్కరు ప్రార్థించాలి

- క్రైస్తవులు ప్రార్థనా జీవితం గడపాలి
- వరంగల్ బిషప్ డాక్టర్ ఉడుమల బాల
- ముగిసిన ఫాతిమామాత మహోత్సవం
- భారీగా హాజరైన క్రైస్తవులు

7

దశదిన కర్మకు వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్ల మృతి
- ఐనపల్లి వద్ద టైరు పగిలి పల్టీ కొట్టిన కారు



యశోద (ఫైల్)



మాణిక్యమ్మ(ఫైల్)

ఖానాపురం/ఖిలా వరంగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కారు టైరు పగిలి పల్టీ కొట్టడంతో ఇద్దరు వృద్ధురాళ్లు మృతి చెందారు. ఈ సంఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని బుధరావుపేట శివారు ఐనపల్లి పెట్రోలు బంకు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి, బాధితుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా ఖిలావరంగల్ 37వ డివిజన్ తూర్పుకోట ప్రాంతానికి చెందిన అక్కాచెల్లెల్లు ఏసీరెడ్డి యశోద(80), బొలుగొడ్డు మాణిక్యమ్మ(78)లు వారి పిల్లలతో కలిసి మహబూబాబాద్ జిల్లాలోని కురవిలోని తమ బంధువు దశదిన కర్మకాండలకు కారులో వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో ఐనపల్లి శివారులోని హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద 365జాతీయ రహదారిపై కారు ముందు టైరు పగిలిపోవడంతో అదుపు తప్పి కుడివైపునకు దూసుకెళ్లిన కారు పల్టీ కొట్టింది. దీంతో కారులో వెనుక సీటులో ఉన్న యశోద, మాణిక్యమ్మలు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. యశోద కుమారుడు రమేష్ కారు నడుపుతుండగా, మాణిక్యమ్మ కుమారుడు హరీష్, కూతురు అనితలు కారులోనే ఉన్నారు. స్వల్పగాయాలతో బయటపడ్డారు. రమేష్, హరీష్‌లు ఖిలావరంగల్‌లోనే ఉంటూ వ్యవసాయం, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. మృతురాలు యశోదకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మాణిక్యమ్మకు సైతం ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఖిలావరంగల్ తూర్పుకోటకు చెందిన బొలుగొడ్డు మాణిక్యమ్మకు భర్త మోహన్ గతంలో మృతి చెందారు.

మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. అలాగే ఏసీరెడ్డి యశోదకు భర్త జనార్ధన్‌తో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. దీంతో ఖిలావరంగల్ తూర్పుకోటలోని మృతుల కుటుంబసభ్యుల రోదనలతో వారి ఇళ్లలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజకీయ ప్రతినిధులతో సమావేశం పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19వ తేదీలోపు ఓటరు జాబితా సవరణ, ఇతర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆయన జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో 3 నెలలకోసారి పకడ్బందీగా అప్‌డేట్ కావాలని, నూతనంగా 18 ఏళ్లు పూర్తిచేసుకున్న ప్రతీ పౌరుడికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటరు జాబితా సవరణ, పోటీ చేసిన అభ్యర్థుల వివరాల సమర్పణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మినిట్స్ ఇతర అంశాలను ఈనెల 27లోపు ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధన ప్రారంభించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధనను ఈనెల 15 నుంచి ప్రారంభించాలని రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ డాక్టర్ యోగితారాణా తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి కమిషనర్ నర్సింహారెడ్డితో కలిసి కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా యోగితా రాణా మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష, తెలంగాణ విద్యాశాఖ మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమం (ఎఫ్ఎల్ఎన్)లో కృత్రిమ మేధను ఉపయోగించి బోధన మెరుగుపర్చనున్నట్లు తెలిపారు. ప్రతీ జిల్లా నుంచి నలుగురికి రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం వరంగల్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఎంపిక కాబడిన 11 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు, ఆయా పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖ అధికారులకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈనెల 15న ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్లాసులు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మీ, డీఈవో జ్ఞానేశ్వర్, క్వాలిటీ కో ఆర్డినేటర్ సుజన్ తేజ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద

కలెక్టర్ హోలీ శుభాకాంక్షలు

హోలీ పండగను ప్రజలు రాగద్వేషాలకు అతీతంగా జరుపుకోవాలని కలెక్టర్ సత్యశారద కోరారు. అందరి జీవితాల్లో సంతోషపు వెలుగులు నింపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సహజ రంగులను వినియోగిస్తూ హోలీ సంబరాలు జరుపుకోవాలని, జిల్లా ప్రజలకు కలెక్టర్ ఒక ప్రకటనలో హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

హోలీ.. ఆనందాలు తేవాలి


పిన్నవారి వీధిలో హోలీ సామగ్రి కొనుగోలు చేస్తున్న పట్టణ వాసులు


వరంగల్ చౌరస్తాలో రంగులు విక్రయిస్తున్న దృశ్యం


రంగులు చల్లుకొనే వివిధ రకాల పైప్‌ట్యూబ్‌లు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న బిస్కెట్ల దండలు

- నేడు రంగుల పండుగ
- సామగ్రి అమ్మకాలతో మార్కెట్లు కళకళ
- ఫాల్గుణ పౌర్ణమి వేళ ప్రత్యేక పూజలు, హోమాలు
- వాడవాడలా కామ దహనాలు

వరంగల్ కల్చరల్/జనగామ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రంగుల పండుగకు అంతా సిద్ధమయ్యారు. కేరింతలు కొడుతూ తమ జీవితాల్లో ఆనందాలు తేవాలి అని కోరుకుంటూ వయసు తారతమ్యం లేకుండా ఫాల్గుణ మాసం పౌర్ణమి రోజున ఉమ్మడి జిల్లా వాసులు హోలీ పండుగను జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసు కున్నారు. వయసుతో తారతమ్యం లేకుండా వివిధ రకాల రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ సంబరాలు చేసుకోనున్నారు. ఇక హోలీ ముందు రోజున కామ దహనం కార్యక్రమాన్ని నిర్వహించడం సంప్రదాయబద్ధంగా వస్తోంది. గురువారం సాయంత్రం నగరంలో కామ దహనాన్ని పలు సెంటర్లలో నిర్వహించారు. కట్టెలన్నీ ఒక చోట వేసి అందులో పిడకలు, కర్పూరం, నెయ్యి లాంటి పదార్థాలను వేసి అగ్నిని వెలిగించి అగ్ని చుట్టూరా నీళ్లను పోస్తూ ప్రదక్షిణ చేసి నమస్కరిస్తారు. కామ దహనాన్ని రామన్నపేటలోని మోక్షారామం అమ్మ ఒడి వద్ద, రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద, చమన్, పిన్నవారి వీధి, అండర్‌బ్రిడ్జి, గిర్మాజీపేట, లక్ష్మీటాకీస్, కాశిబుగ్గ, కరీమాబాద్, శివనగర్, రంగశాయిపేట, ఓసిటీ, దేశాయిపేట, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో కామ దహనాలు నిర్వహించారు.

పురాణం

ఫాల్గుణ పౌర్ణమిని హోలీ పర్వదినంగా నిర్వహిస్తారు. ఈ హోలీ పర్వదినం రోజున పురాణాల కాలం నుంచి పలు కథనాలు వాడుకలో ఉన్నాయి. క్షీరసాగర మథనంలో ఫాల్గుణ పౌర్ణమి రోజున మహాలక్ష్మి ఉద్భవించిందని హిరణ్యకశిపుడు తన కూతురు హోలీకాదేవి కుమారుడు ప్రహ్లాదుడిని విష్ణుదేవుడిని పూజించకుండా అగ్ని ప్రవేశం చేయాలని ఆదేశించగా అగ్ని నుంచి ప్రహ్లాదుడు బయటకు రావడం హోలీకాదేవి ఆహుతి కాగా అప్పటి నుంచి రంగులు చల్లుకునే సంప్రదాయం ప్రారంభమైనట్లు చెబుతారు. రాధాదేవికి రంగులు పూయాలని కృష్ణుడికి యశోదాదేవి తెలపడంతో ఫాల్గుణ పౌర్ణమి రోజున రాధాకృష్ణుడు రంగులు చల్లుకొని వసంతోత్సవం నిర్వహించుకుంటారు. అప్పటి నుంచి హోలీ రోజున ఉత్సవాలను జరుపుతున్నట్లు ప్రతీతి.

వసంతోత్సవాలు, డోలోత్సవాలు


రంగులు చల్లే పైపులను కొనుగోలు చేస్తున్న చిన్నారులు

హోలీ సందర్భంగా పలు దేవాలయాల్లో వసంతోత్సవాలు, డోలోత్సవాలు అనగా రంగులను దేవ తామూర్తులకు చల్లే పూజా కార్యక్రమం హోమాలు నిర్వహించడం చేస్తారు. అలాగే హోలీ పర్వ దినం రోజున సంతోషక రమైన రోజుగా భావించి తమ ఇంట్లోని చిన్నారులకు కుటుంబ సభ్యుల్లో ఉన్న చిన్నారులకు బహుమానంగా సంతోషంతో బిస్కెట్లతో తయారు చేసిన మాలలను అందిస్తారు.

రంగుల అమ్మకాలు

హోలీ పండుగ సందర్భంగా రంగులు అమ్మే దుకాణాలు పెద్ద సంఖ్యలో వెలిశాయి. రెండు రోజుల నుంచి నగరంలో, జిల్లాలోని మండల కేంద్రాల్లో రంగుల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. వరంగల్ నగరంలోని బట్టల బజార్, చౌరస్తా, పిన్నవారి వీధి, స్టేషన్‌రోడ్డు, పోస్టాఫీస్ సెంటర్, కాశిబుగ్గ, చమన్, పోచమ్మమైదాన్, అండర్‌బ్రిడ్జి, రంగశాయిపేట, కరీమాబాద్ తదితర ప్రాంతాల్లో రంగులు అమ్మే దుకాణాలు వెలిశాయి.

రాయపర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : హోలీ అంటేనే ఆనందాల పండుగ. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ రంగుల్లో మునిగి తేలుతుంటారు. అయితే నాటి తరం జరుపుకున్న వేడుకలకు, నేటి తరం యువత చేసుకుంటున్న సంబరాలకు పోలికే లేకుండా పోయింది. గతంలో సహజ రంగులతో ఎంతో హుందాగా జరుపుకుంటే, నేడు రసాయనాలతో తయారు చేసిన రంగులు పూసుకుంటున్నారు. అప్పట్లో మోదుగు, తంగేడు, గోరింటాకు, వివిధ రకాల పండ్లతో రంగులు తయారు చేసుకునే వారు. అనంతరం స్నానం చేస్తే ఆ రంగులు పోయి శరీరం తాజాగా ఉండేది. ఇక హోలీ పండుగకు గోగుపూలకు విడదీయలేని బంధం ఉంది. గతంలో హోలీ వస్తుందంటే వారం రోజుల ముందుగానే పిల్లలు, యువకులు గోగుపూవులు తీసుకువచ్చి నీటిలో నానబెట్టేవారు. తర్వాత ఉడకబెటిడితే వచ్చే రంగు నీళ్లను సీసాల్లో, డబ్బాల్లో నింపుకుని హోలీ ఆడేవారు. ఈ సహజ సిద్ధ రంగు నీళ్లతో ఎలాంటి రోగాలు వచ్చేవి కావు. ఇప్పుడవన్నీ అంతరించిపోయాయి. రసాయన మిళిత రంగుల వాడకం పెరిగింది. ప్రస్తుతం వాడుతున్న రంగుల్లో ప్రమాదకరమైన క్రోమియం, అల్యూమినియం, మెర్క్యూరీ ఆక్సైడ్ లాంటివి ఉంటుండంతో పలు రకాల ఆరోగ్య, చర్మ సమస్యలు వస్తున్నాయి. ఈ క్రమంలో సురక్షిత రంగులతో ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా సంబరాలు చేసుకోవాలంటే పలు రకాల పూలు, పండ్లతో ఇళ్లలోనే సహజ సిద్ధమైన రంగులు తయారు చేసుకోవచ్చు. వీటితో చర్మానికి మేలు కలగడతో పాటు ఆరోగ్యంగా ఉంటారని పర్యావరణ వేత్తలు, వైద్యనిపుణులు చెబుతున్నారు. ఎర్ర గులాబీ, మందారం పూలు, ఎర్ర చందనం, టమాటా గుజ్జు, క్యారెట్, బీట్‌రూట్‌తో ఎరువుపు రంగు తయారవుతుంది. అచ్చమైన పసుపు పొడి, తంగేడు, రేల, బంతి, చామంతి, తుమ్మ పూలతో పసుపు రంగు ద్రావకం సిద్ధమవుతుంది. వేసవిలో విరివిగా లభించే మోదుగ పూలతో కాషాయ రంగు తయారు చేయవచ్చు. ఎండిన గోరింటాకు పొడి లేదా పచ్చి గోరింటాకు, పాలకూర, పూదీనా, కొత్తిమీర లాంటి ఆకుకూరలతో ఆకుపచ్చ రంగు నీరు చేసుకోవచ్చు.


మోదుగు పూల చెట్టు

సహజ రంగులతోనే సురక్షితం

- రసాయన రంగులతో అనారోగ్య సమస్యలు
- కాలంతో పాటు మారుతున్న సంప్రదాయాలు

కృత్రిమ రంగులతో ఆరోగ్య సమస్యలు

డాక్టర్ రవీంద్ర నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో



హోలీ వేడుకల్లో కృత్రిమ రంగులు వాడడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఆ రంగులు కళ్లలో పడితే కంటి వాపు, మసక బారిపోవడం లాంటి సమస్యలు వస్తాయి. ఇక చర్మంపై పడితే పొడి బారడం, దురదలు వచ్చే ప్రమాదం ఉంది. ముక్కు, నోటి ద్వారా శరీరంలోకి వెళ్తే శ్వాస, జీర్ణ సమస్యలు వస్తాయని, హోలీలో సహజ రంగులనే వాడడం మంచిది.

సహజ రంగులనే వాడాలి

రావుల భాస్కర్ రావు, పర్యావరణ వేత్త



హోలీకి సహజ రంగులనే వాడాలి. మార్కెట్‌లో లభిస్తున్న రంగుల్లో రసాయనాలు కలుస్తున్నాయి. ఇవి కళ్లలో పడితే కంటి చూపునకే ప్రమాదం. అందుకే హోలీలో సహజ రంగులు వాడాలి. కండ్లకు అద్దాలు ధరించాలి. కళ్లల్లో రంగు పడితే వెంటనే కడుక్కోవాలి. ఇబ్బందిగా మారితే వైద్యుడిని సంప్రదించాలి. దీనికి తోడు శరీరంపై రసాయనిక రంగులు చల్లుకోవడం వలన చర్మం పై దద్దుర్లు ఏర్పడడం, దురద వంటి సమస్యలు ఎక్కువగా వస్తాయి.

సంప్రదాయ పద్ధతుల్లో

హోలీ జరుపుకోవాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ పద్ధతుల్లో హోలీ జరుపుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. హోలీ నేపథ్యంలో ప్రజలకు సీపీ సలహాలు, సూచనలు చేశారు. సహజ రంగులను వినియోగించి ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడపొద్దని, హోలీ అనంతరం యువత స్నానాల కోసం శివారు ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని, వెళ్లాల్సి వస్తే తగు జాగ్రత్తలతో వెళ్లాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో అనుమతులు లేకుండా మహిళలు, ఇతర వ్యక్తులపై రంగులు చల్లడం, బైకులు, కార్లపై గుంపులుగా తిరుగుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హోలీ ప్రశాంతంగా జరుపుకునేందుకు కమిషనరేట్‌లో ముమ్మర పెట్రోలింగ్ ఉంటుందని, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై ప్రత్యేక దృష్టి ఉంటుందన్నారు.

వాగ్దేవిలో ముగిసిన వర్క్‌షాపు


ప్రొఫెసర్లతో విద్యార్థులు

హనుమకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని సరైన దిశలో ఉపయోగిస్తే గొప్పవాళ్లుగా తయారవుతారని ఐఐసీటీ ప్రొఫెసర్ రాజిరెడ్డి అన్నారు. జాయింట్ ఇండియన్ అకాడమీ సైన్సెస్ ఈ నెల, 12, 13 తేదీల్లో 'జీవ రసాయన, సంశ్లేషణ, ఔషధ రసాయన శాస్త్రం, అండ్ స్పెక్ట్రల్ విశ్లేషణలో తాజా పురోగతులు' అనే అంశంపై అకాడమీ లెక్చర్ వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం నిర్వహించగా, ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సమకాలీన శాస్త్రీయ పురోగతాలపై మార్చి 12న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ రామాచారి, ఐఐసీటీ ప్రొఫెసర్ రవి శంకర్, మార్చి 13న జరిగిన సెషన్‌లో వర్క్‌షాపు కన్వీనర్ ఐఐసీటీ ప్రొఫెసర్ రాజిరెడ్డి, హైదరాబాద్ బిట్స్ ప్రొఫెసర్ మహిపాల్ రెడ్డి ప్రసంగించారు. ముగింపు సమావేశంలో కేయూ బీఓఎస్ చైర్‌పర్సన్ సబితా జ్యోత్స్న, కేయూ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మమత, కళాశాల సంస్థాపకుడు డాక్టర్ సీహెచ్ దేవేందర్ రెడ్డి, డాక్టర్ సీహెచ్ వాహినీ దేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శేషాచలరం, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరేందర్‌రెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రసాయన శాస్త్ర విభాగం అధిపతులు గోవిందరావు, రజిత, రసాయన అధ్యాపకులు ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, లైఫ్ సైన్సెస్ డీన్ డాక్టర్ విక్రం తదితరులు పాల్గొన్నారు.

కొత్త పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయండి

డీజీపీని కోరిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


డీజీపీకి లేఖను అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కొత్త పోలీస్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర డీజీపీ జితేందర్‌రెడ్డిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో డీజీపీని ఎమ్మెల్యే నాయిని కలిసి కొత్త పోలీస్‌స్టేషన్‌ల అవసరాన్ని వివరించి లేఖను అందజేశారు. నియోజకవర్గ పరిధిలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా ప్రజల భద్రత కోసం వడ్డెపల్లి, న్యూశాయంపేట ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ ప్రజా రవాణా వ్యవస్థను పటిష్టం చేసేందుకు కేయూ పీఎస్ పరిధిలో ట్రాఫిక్ పీఎస్‌లు ఏర్పాటు కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని డీజీపీకి అందించిన లేఖలో కోరారు. కమిషనరేట్ పరిధిలో నూతన పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని డీజీపీకి నాయిని వివరించారు.

మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాస్

చెన్నారావుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన వింతంతువు మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు నెక్కొండ సీఐ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన ఆకుల అశోక్ బుధవారం ఉదయం ఓ మహిళ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో మహిళ తీవ్ర మనస్తాపంతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు మహిళను నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. నిందితుడు గ్రామం నుంచి పరారయ్యాడు. గురువారం అమీనాబాద్ గ్రామశివారులో నిందితుడు తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. మహిళ బంధువుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోర్టులో రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీకేఎం ఆస్పత్రి ఆర్ఎంవోగా మురళి



గిర్మాజీపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌గా (ఆర్ఎంవో) డాక్టర్ కె.మురళి బుధవారం సాయంత్రం విధుల్లో చేరారు. గురువారం ఆయన ఆస్పత్రి ఇన్‌పేషంట్ వార్డులు, రిజిస్ట్రేషన్ కౌంటర్, లేబర్ రూం ప్రాంగణం, అవుట్‌పేషంట్ బ్లాక్‌ను సందర్శించి రోగుల వైద్య సేవల్లో నిర్లక్ష్యం ఉండరాదని సూచించారు. వైద్యులు, అన్ని రకాల సిబ్బంది సమయపాలన పాటించాలని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా, గత జూలై నుంచి ఆస్పత్రి ఆర్ఎంవో పోస్టు ఖాళీగా ఉండటంతో పాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటాన్ని ఆస్పత్రి సందర్శనలో గమనించిన కలెక్టర్.. ఎంజీఎం ఆర్ఎంవోగా పనిచేసిన డాక్టర్ కె.మురళిని సీకేఎం ఆస్పత్రికి నియమించినట్లు తెలిసింది. గురువారం వైద్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సమీకృత గురుకులం.. విద్యా ప్రగతికి సోపానం


యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ భవన నమూనా


జఫర్‌గఢ్‌లో స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే శ్రీహరి (ఫైల్)

- కార్పొరేట్, అంతర్జాతీయ స్థాయి విద్య
- ఐదు నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమం
- స్కూల్ భవనాల నిర్మాణానికి రూ.200 కోట్లు
- జఫర్‌గఢ్ మండలంలో గురుకులం ఏర్పాటు
- 16న స్కూల్ నిర్మాణానికి సీఎం రేవంత్ శంకుస్థాపన

సందర్భం

జఫర్‌గడ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోంది. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సామాజిక అంతరాలు లేని అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న సదాశయంతో ప్రభుత్వం రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున తొలి విడత 55 చోట్ల ఏర్పాటుకు యంగ్ ఇండియాఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. ఇందులో భాగంగా జనగామ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి మంజూరైన ఈ సమీకృత గురుకులాన్ని ఆధునాతన వసతులు, అన్ని రకాలైన మౌలిక సదుపాయాలతో జఫర్‌గడ్ మండలంలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గురుకుల పాఠశాలకు రూ.200 కోట్లు పరిపాలనా అనుమతులతో నిధులు మంజూరు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 16న సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గ పర్యటన సందర్భంగా స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

జఫర్‌గడ్ మండలంలో ఏర్పాటు..

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను జఫర్‌గడ్ మండలంలో నిర్మించనున్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ చూపి పాఠశాలను స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏర్పాటుకు విశేష కృషి చేశారు. 2,560 మంది విద్యార్థులు ఒకే చోట చదువుకునేందుకు వీలుగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాన్ని జఫర్‌గడ్ మండలం తిమ్మంపేట- జఫర్‌గడ్ ప్రధాన రహదారి పక్కన గల కోనాయిచలం పరిధిలోని 21ఎకరాల సువిశాల ప్రభుత్వ స్థలంలో నిర్మించనున్నారు.

5 నుంచి ఇంటర్ వరకు..

ఈ సమీకృత గురుకులంలో అన్ని వర్గాలకు ఒకే చోట ప్రవేశాలు కల్పిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ ప్రతీ ఒక్కరు 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవచ్చు. వీరికి ఉచిత వసతితో పాటు నాణ్యమైన భోజనం అందిస్తారు. అయితే వీటిలో ప్రవేశాలు పోటీ పరీక్ష ద్వారానా.. లేక దరఖాస్తు చేసుకుంటే ప్రవేశాలు కల్పిస్తారా..? అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు. సమీకృత పాఠశాల అందుబాటులోకి వస్తే పేద విద్యార్థుల వసతి కష్టాలు దూరమవుతాయి.

క్రీడలు, కళలకు ప్రాధాన్యం..


గురుకులంలో ఇన్నోవేటివ్ బోధనా విధానం ఉంటుంది. సహజ సిద్ధంగా వెలుతురు వచ్చేలా భవనాలను నిర్మిస్తారు. గ్రీన్ క్యాంపస్, సోలార్, విండ్ ఎనర్జీ సదుపాయాలు కల్పిస్తారు. దివ్యాంగులకు అనుకూలమైన సౌకర్యాల కల్పనతో పాటు వర్షపు నీటి సంరక్షణ, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రత్యేక ఆడిటోరియం నిర్మించ నున్నారు. క్యాంపస్‌లో చదువుతోపాటు క్రీడలు, కళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తరగతి గదులు, ల్యాబోరేటరీలు కాకుండా కంప్యూటర్ సెంటర్, గ్రంథాలయం, ఆడిటోరియం, ఇండోర్ స్పోర్ట్స్, క్రికెట్, ఫుట్‌బాల్ మైదానాలు, బాస్కెట్ బాల్, వాలీబాల్, టెన్నిస్ కోర్టులు, ఔట్‌డోర్ జిమ్, థియేటర్, ల్యాండ్ స్కేప్ కోర్టులు వంటి సౌకర్యాలు ఉండనున్నాయి.

ప్రత్యేకతలు ఇవే..

- ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీలకు చెందిన నాలుగు పాఠశాలలు ఈ భవనంలో ఉంటాయి.
- ఒక్కో పాఠశాలలో 640 మంది విద్యార్థులు
- ప్రతీ పాఠశాలలకు వేరు వేరు బ్లాక్‌లు.
- ప్రతీ పాఠశాలలో 30మంది చొప్పున ఉపాధ్యాయులు
- గ్రంథాలయంలో 5వేల పుస్తకాలు, కంప్యూటర్ కేంద్రంలో 60 కంప్యూటర్లు అందుబాటులో ఉంటాయి.
- అన్ని తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఉంటాయి.
- 900 మంది ఒకేసారి కూర్చుని భోజనం చేసేలా డైనింగ్ హాలు
- ఇష్టమైన రంగాల్లో రాణించేలా శిక్షణ. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా బోధన. విద్యార్థులను చదువుల యంత్రం మాదిరిగా కాకుండా వివేకవంతులుగా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠాలు. విద్యార్థుల అభిరుచికి తగ్గట్టుగా ఇష్టమైన రంగంలో రాణించేలా శిక్షణ ఇచ్చేలా పాఠశాలలను అభివృద్ధి చేయనున్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు ద్వారా పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందుతుంది. నియోజకవర్గానికి మంజూరైన ఈ రెసిడెన్షియల్ పాఠశాలను ఆధునాతన వసతి సౌకర్యాలతో జఫర్‌గడ్ మండలం కోనాయిచలం పరిధిలో విశాలమైన స్థలంలో నిర్మించడం జరుగుతుంది. ఈ మేరకు ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నా. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు అనేది విప్లవాత్మకమైన నిర్ణయం. పేద విద్యార్థులకు ఓ వరం. 16న సీఎం శంకుస్థాపన చేస్తారు.

ఆల్ ఇన్ వన్.. అల్లాపురం

- రంగుల ప్రపంచంలో వరంగల్ కుర్రాడి ప్రతిభ
- నటుడిగానే కాకుండా పలు విభాగాల్లో రాణిస్తున్న దామోదర్
- కథా, పాటల రచయితగానూ సత్తా
- ఏడీఆర్ ఫిలిం ఫ్యాక్టరీతో ఔత్సాహికులకు నటనలో శిక్షణ


'రైతన్న మేలుకో' షూటింగ్ స్టిల్ (ఫైల్)

వరంగల్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కళలకు పుట్టినిల్లు.. కాకతీయులు ఏలిన వరంగల్ గడ్డపై పుట్టిన అల్లాపురం దామోదర్ రంగుల ప్రపంచంలో ప్రతిభ చాటుతున్నారు. ఆరోతరగతి చదువుతున్నపుపడే 'ఆడది అబలకాదు.. జగతికే మూలమైన ఆదిపరాశక్తిరా..' అంటూ రాసిన కవితతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల ప్రశంసలు అందుకున్న దామోదర్‌ను.. సరదాగా రాసిన కవితలు, పాడిన పాటలు రచయితగా, గాయకుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, నటుడిగా వెండి, బుల్లి తెరపై కళామతల్లి ఒడిలో కూర్చోబెట్టాయి. స్వశక్తితో వెండి తెరకు పరిచయమై ఓ వెలుగు వెలుగుతున్న వరంగల్ కళాకారుల జాబితాలో దామోదర్ కూడా స్థానం సంపాదించుకున్నారు. ప్రస్తుతం దామోదర్ ఓదెల 2, హస్తినాపురం సినిమాల్లో నటిస్తున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు దంపతులు అల్లాపురం రాజయ్య, కనుకబాయికి మూడో సంతానంగా 1977లో జన్మించిన దామోదర్.. డిగ్రీ వరకు చదివారు. 1999లో తాను రాసిన పాటలు పదిమందికి తెలియాలనే ఉద్దేశంతో సొంత డబ్బులతో గాయకులు దీకొండ సారంగపాణి, అశోక్, సునిత ఆలపించిన ప్రేమాంజలి ఆడియో క్యాసెట్‌తో తనకళామయ జీవితానికి శ్రీకారం చుట్టారు. ఆ తరువాత పాటలు రాయడం, సినిమా, షార్ట్ ఫిలిమ్స్‌కు కథలు అందించడం, స్ర్కీన్‌ప్లే, నటించడం, నిర్మాతగా, దర్శకుడిగా సినిమాలు, షార్ట్‌ఫిలిమ్స్ రూపొందించారు. అలాగే పాన్ ఇండియా సినిమా లాగానే 'అనుకున్నానే ఆనాడు' అనే పాటను తెలుగులో రాసి.. ఆ తర్వాత దానిని కన్నడ,తమిళ్, మళయాళం, హిందీ, మరాఠీ, బంజారా ఏడు బాషల్లో రాయించి వీడియో చిత్రీకించి చేసి విడుదల చేశారు.


హీరో విజయ్ దేవరకొండతో దామోదర్

యూట్యూబ్‌లో ఆదరణ

నటుడిగా, కథకుడిగా, పాటల రచయితగా, స్ర్కీన్‌ప్లే, నిర్మాతగా, దర్శకుడిగా అల్లాపురం దామోదర్ చేతిలో రూపుదిద్దుకున్న పలు పాటలు, షార్ట్‌ఫిలిమ్స్ యూట్యూబ్, ఇన్‌స్టాలో ఆదరణ పొందాయి. వాటిలో రైతుల కష్టాలను చూపే కన్నీటిధార, విలువలను తెలిపే గుండెలపై మోసే నాన్న, ఊరిడిసిన కొడుకు కథ (సాంగ్), ఎంతపని చేస్తివే ఓటమ్మ పాటలతో పాటు కేస్ క్లోజ్ షార్ట్‌ఫిలిం, తోడబుట్టిన తోడు, గల్లగురిగి, లవ్ ట్రావెల్ ఇండిపెండెంట్, ఇల్లరికం అల్లుడు, ఆర్ఎస్‌నంద వంట మనిషి కామెడీ షార్ట్‌ఫిలిమ్స్ లక్షల్లో వ్యూస్ సంపాదించాయి. వీటితో పాటు ఏడీఆర్ ఫిలిం ఫ్యాక్టరీ నుంచి సుమారు 50 షార్ట్‌ఫిలిమ్స్, 30 వీడియో సాంగ్స్ తీశారు. రచయితగా, దర్శకుడిగా ప్రస్తుతం రైతన్న మేలుకో షూటింగ్ జరుగుతోంది. ప్రయాణంలో పరిచయం, గున్నమామిడి కొమ్మమీద లాంటి రెండు సినిమాలకు దామోదర్ కథ, స్ర్కీన్‌ప్లే, దర్శకత్వం వహించారు. యూట్యూబ్‌లో పెట్టిన సినిమాలు, షార్ట్‌ఫిలిమ్స్, వీడియో సాంగ్స్ వల్ల దామోదర్‌కు నెలకు 30 నుంచి 40 వేల వరకు ఆదాయం వస్తోంది.

స్వయం కృషినే నమ్ముకున్న దామోదర్

1999లో ప్రేమాంజలితో మొదలైన ప్రయాణం అంచలంచలుగా ఎదుగుతూ వచ్చారు. పాటలు, కథ, రచనలను తీసుకుని దామోదర్ హైదరబాద్‌లోని ప్రముఖ నిర్మాతలను, నటులను, దర్శకులను కలిసిన ఫలితం కనిపించేదు.దీంతో దామోదర్ స్వశక్తిని నమ్ముకున్నారు. తన మిత్రులు, పరిచయస్తులతో కలిసి ప్రయాణంలో పరిచయం, గున్నమామిడి కొమ్మమీద లాంటి సినిమాలకు కథ, స్ర్కీన్‌ప్లే, దర్శకత్వం వహించారు. అవి అనుకున్నంత హిట్ కాలేదు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా తక్కువ బడ్జెట్‌తో షార్ట్ ఫిలిమ్స్‌ను నిర్మిస్తూ వస్తున్నారు. కొన్ని తన (ఏడీఆర్) బ్యానర్‌లో నిర్మిస్తుండగా, కొన్ని వేరే వాళ్ల బ్యానర్‌లో నిర్మించే వాటికి నటుడిగా, కథ, స్ర్కీన్‌ప్లే, దర్శకత్వం బాధ్యతలను చూస్తున్నారు. మరోపక్క హనుమకొండలోని బాలసముద్రంలో ఏడీఆర్ ఫిలిం ఫ్యాక్టరీని స్థాపించి ఔత్సాహిక కళాకారులకు నటనలో శిక్షణ ఇస్తున్నారు.


కెమెరామెన్‌కు సూచనలు ఇస్తున్న దామోదర్ (ఫైల్)

వరంగల్‌ను షూటింగ్‌లకు వేదిక చేయడమే లక్ష్యం : అల్లాపురం దామోదర్



కళలకు పుట్టినిల్లు ఓరుగల్లు. ఇక్కడ కళాకారులకు కొదువలేదు. లోకేషన్లకు కొదువలేదు. కావాల్సిందల్లా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని లోకేషన్లు అద్భుత కళాఖండాలు. వాటిని సద్వినియోగం చేసుకుంటే నిర్మాతలకు రూ.కోట్లు ఖర్చు తప్పుతుంది. మంచి మంచి కళాకారులు కూడా ఉన్నారు. కావా ల్సిందల్లా 24 క్రాఫ్ట్స్ సంబంధించిన సినీ, టీవీ, నాటక కళాకా రులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం. అదే జరిగితే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వర్క్ షేరింగ్‌తో సినిమాలు రూపొందించవచ్చు. ప్రభుత్వ సహకారంతో పాటు కళాకారులంతా సహకరిస్తే స్టూడియో కూడా ఏర్పాటు చేసుకుని సినిమా షూటింగ్‌లకు వరంగల్‌ను వేదికగా చేయాలనేదే సంకల్పం.

ప్రపంచ శాంతి కోసం ప్రార్థించాలి

- వరంగల్ బిషప్ ఉడుమల బాల
- ముగిసిన ఫాతిమామాత మహోత్సవం


సందేశమిస్తున్న బిషప్


హాజరైన క్రైస్తవులు

కాజీపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థించాలని, క్రైస్తవులు పశ్చాతాపం, పరివర్తన, ప్రార్థనా జీవితంతోనే జీవించాలని వరంగల్ బిషప్, విశాఖ అగ్ర పీఠాధిపతి డాక్టర్ ఉడుమల బాల క్రైస్తవులకు పిలుపునిచ్చారు. రెండు రోజులుగా కాజీపేట ఫాతిమానగర్ కెథడ్రల్ చర్చిలో జరుగుతున్న ఫాతిమామాత ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గురువారం ఉదయం బిషప్ హౌస్ నుంచి కెథడ్రల్ చర్చి వరకు ఓపెన్‌టాప్ వాహనంలో వచ్చిన బిషప్‌కు క్రైస్తవులు ఘన స్వాగతం పలికారు. చర్చికి చేరుకున్న బిషప్ సమష్టి దివ్య బలిపూజ సమర్పించారు. అనంతరం బిషప్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. మెదటి ప్రపంచ యుద్ధాన్ని నిలిపివేసింది ఫాతిమా మాతే అన్నారు. ఈ జూబ్లీ ఏడాదిలో పండుగను జరుపుకోవడం ప్రపంచ శాంతి నెలకొన్న నేపథ్యంతో అన్నారు. పోర్చుగల్ దేశంలో ముగ్గురు చిన్నారులకు ఫాతిమా మాత కనిపించి ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని చెప్పిందని గుర్తు చేశారు. అంతకుముందు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు బెంగళూరు అగ్రపీఠం ఫాదర్ మెస్సీ గ్నేర్ ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు చేశారు. కాజీపేట విచారణ గాయక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక గీతాలు ఆలపించారు. క్రైస్తవులు పెద్దఎత్తున కెథడ్రల్ చర్చి, మరియమాత గుహ వద్దకు చేరుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విశాఖ అగ్రపీఠాధిపతిగా ఎన్నికైన డాక్టర్ ఉడుముల బాలను వరంగల్ డయాసిస్ కౌన్సిల్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా కెథడ్రల్ విచారణ కౌన్సిల్ అధ్యక్షుడు బొక్క దయాసాగర్, మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ రాజయ్య, 49 డివిజన్ కార్పొరేటర్ మానస రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలకు మోసపోవద్దు

తెలియని యాప్‌లు, ఫోన్ కాల్స్, లింక్‌లకు స్పందించొద్దు

- సైబర్ క్రైం జరగగానే 1930 కాల్ చేయాలి
- స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కావాలి
- సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్
- 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

వరంగల్ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 'సాంకేతికంగా వస్తున్న మార్పులను సైబర్ నేరస్థులు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వారు చెప్పే మాయమాటలకు అత్యాశకు పోతున్న వారు కొందరు, అమాయక ప్రజలు కొందరు మోసమోతున్నారు. సైబర్ నేరస్థుల వలలో చిక్కి విలవిలలాడుతున్నారు' అని వరంగల్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల సైబర్‌మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను గురువారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఫోన్ చేసి ఏసీపీ ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ క్రమంలో ఏసీపీ ప్రజలకు పలు సలహాలు ఇచ్చారు. తెలియని వ్యక్తులను నమ్మి, ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడులు పెట్టడం, ఆన్‌లైన్ యాప్‌ల నుంచి రుణాలు తీసుకోవద్దని, భౌతికంగా చూడని విషయాలను అసలు నమ్మొద్దన్నారు. ఆన్‌లైన్ మోసానికి గురైనట్టు అనుమానం రాగానే క్షణాల్లో (గోల్డెన్ అవర్) ఆలస్యం చేయకుండా 1930కు ఫోన్‌చేస్తే డబ్బులు డ్రా చేయకుండా ఆపొచ్చన్నారు. ఒకసారి సైబర్ నేరస్థులు డబ్బులు డ్రా చేసుకుంటే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉండదని వివరించారు. 1930 ద్వారానే సైబర్ క్రైంకు సత్వర పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. రూ.10లక్షల లోపు అయితే స్థానిక పోలీస్‌స్టేషన్, రూ.10లక్షలకు పైగా ఉంటే కమిషనరేట్ కార్యాలయంలోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఫోన్‌ఇన్‌కు వచ్చిన కాల్స్‌లో కొన్ని..

- లోన్‌యాప్‌లో రుణాన్ని చెల్లించినా గుర్తుతెలియని వ్యక్తులు నాతో పాటు నా సంబంధికులకు ఫోన్లు చేసి వేధిస్తున్నారు. ఏం చేయాలి?

- శివ, వరంగల్

ఏసీపీ : లోన్‌యాప్‌ల జోలికి వెళ్లొద్దు. మీ సంబంధీకులకు ఫోన్ చేస్తే ఎవరూ పరిగణలోకి తీసుకోవద్దని చెప్పండి. కొద్ది రోజులు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పెట్టండి. సెల్‌ఫోన్‌లో యాప్ తీసేయాలి. లేదంటే కమిషనరేట్‌లోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు వస్తే ఫోన్ రీసెట్ చేసి ఇస్తాం.

- ఇన్వెస్ట్‌మెంట్ పేరిట ఓ ఖాతాకు రూ.2,72,000 డబ్బులు వేసి మోసపోయాం. 1930కు ఫోన్ చేసినా ఇప్పటి వరకు డబ్బులు రికవరీ కాలేదు.

-షాకీర్, పరకాల

ఏసీపీ : 1930 ఫోన్ చేసి వదిలేస్తే సరిపోదు. వివరాలన్నీ చెప్పిన తర్వాత ఫిర్యాదులో చెప్పింది వాస్తవమేనని మీ ఫోన్ నెంబర్‌కు ధ్రువీకరణ మెసేజ్ వస్తుంది. దాని ఆధారంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి. ఆ తర్వాత ఫ్రీజింగ్ అయిన డబ్బులు మీ ఖాతాలోకి వస్తాయి. కేవలం మెసేజ్ ఒక్కటే వచ్చి కేసు నమోదు కాకపోతే డబ్బులు జమ కావు.

- మార్టిగేజ్ లోన్‌లో ఒక కిస్తీ చెల్లించనందుకు నా ఫోన్ హ్యాక్ చేసి నగరంలోని ఓ ప్రముఖ కంపెనీ వేధిస్తోంది.

- సంపత్‌కుమార్, మెడికల్ షాపు నిర్వాహకుడు

ఏసీపీ : లోన్ కిస్తీ చెల్లించనందుకు ఫోన్ చేసి వేధించడం నేరం. మీకు లేదా మీకు ష్యూరిటీ పెట్టిన వారికి లీగల్ నోటీసులు ఇవ్వాలి. ఓ ప్రముఖ కంపెనీ ఈ విధంగా వ్యవహరించడం సరికాదు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయసహాయం పొందండి. ఆఫ్‌లైన్‌లో రుణం తీసుకున్నందున సైబర్ క్రైంతో దీనికి ఎలాంటి సంబంధం ఉండదు.

- ప్రకృతి విలేజ్ మార్ట్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయాం. తిరిగి డబ్బులు ఎలా పొందాలి..?

- భాస్కర్, వరంగల్

ఏసీపీ : భౌతికంగా వ్యక్తులతో మాట్లాడి నమ్మకంతో పెట్టుబడి పెట్టారు కనుక ఇది సైబర్ క్రైం కిందికి రాదు. చీటింగ్ కేసు కిందికి వస్తుంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం పొందొచ్చు.

- తరచుగా ఏపీకే ఫైల్స్ రావడం, అనవసరమైన ఫోన్ వస్తున్నాయి. ఆపడం ఎలా..?

- కామిడి సతీష్‌రెడ్డి, భూపాలపల్లి

ఏసీపీ : తెలియని వారి నుంచి వచ్చిన ఏపీకే ఫైల్స్, యుఆర్ఎల్ లింక్‌లను ఓపెన్ చేయకూడదు. దాని ద్వారా ఫోన్లు హ్యాక్ అయ్యే ప్రమాదం ఉంది. అన్ వాంటెడ్ ఫోన్ కాల్ వచ్చిన వెంటనే ఫోన్‌కు మెసేజ్‌లు వస్తుంటాయి. మళ్లీ కాల్ చేయాలా.. వద్దా.. అని దానికి నో అని బదులు ఇవ్వాలి. ఫోన్ సెట్టింగ్స్‌లలో ఆప్షన్స్ ఉంటాయి వాటిలోనైనా అన్ వాంటెడ్ మెసేజ్‌లు, ఫోన్స్ రాకుండా సెలెక్ట్ చేసుకోవచ్చు. మాల్‌వేర్ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ అయినా ఇదే విధంగా ఏపీకే ఫైల్స్, కుప్పలు, కుప్పలుగా మెసేజ్‌లు వస్తుంటాయి. మా దగ్గరికి వచ్చినా, లేదా భూపాలపల్లిలో ఉన్న జిల్లా సైబర్ క్రైం కో-ఆర్డినేషన్ సెంటర్‌కు వెళ్లినా మీ ఫోన్‌ను క్లీన్ చేసి ఇస్తారు.

- ఫేస్‌బుక్‌లో సిమెంట్ డీలర్‌షిప్ ఇస్తారన్న ప్రకటన చూసి రూ.2,12,000 చెల్లించి మోసపోయాం. ఏమి చేయాలి ?

- రమేశ్, ధర్మసాగర్

ఏసీపీ : ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దు. వ్యక్తులను ప్రత్యక్షంగా కలిసి వాస్తవమేనని నమ్మకం కలిగిన తర్వాతే పెట్టుబడి పెట్టాలి. ముందుగా 1930కు ఫిర్యాదు చేసి తర్వాత స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించండి. డబ్బులు ఫ్రీజ్ అయితే అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ అవుతుంది. లేదంటే వ్యక్తి పట్టుబడ్డప్పుడు మీరు పెట్టిన కేసు ద్వారా నిందితుడిని జైలుకు తరలించవచ్చు.




ఫోన్‌ఇన్‌లో సందేహాలను నివృత్తి చేస్తున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్ కుమార్

హస్తంలో.. ఐక్యత సాధ్యమేనా?

(5వ పేజీ తరువాయి)

నామినేటెడ్ పదవుల భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికే విభేదాలతో ఎమ్మెల్సీ సీటు చేజార్చుకున్న ఓరుగల్లు నేత మధ్య విభేదాలు ఇలాగే కొనసాగితే.. టీపీసీసీలో కూడా పదవులు రావటం కష్టమే అనే చర్చ జరుగుతోంది. దీంతో వరంగల్ నేతల మధ్య ఉన్న విభేదాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని అగ్రనేతలు మంత్రులకు సూచనలు చేస్తున్నట్టు సమాచారం. ఇటీవల జరిగిన క్యాబి నెట్ సమావేశంలో స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌తో పాటు మరో మూడు ఉమ్మడి జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఉన్న విభేదాలను ప్రస్తావించినట్లుగా సమాచారం. ఎమ్మెల్యేలను కలుపకపోవాల్సిన బాధ్యత మం త్రులపైనే ఉందని సీఎం సూచించినట్టు సమాచారం. తొలుత ఎమ్మెల్యేలతో విందు, మరోసారి ఎమ్మెల్యేలకు సంబంధించిన పెండింగ్ పనులు, బిల్లులు, ఇతర వాటిపై దృష్టిపెట్టాలని అధిష్టానం నుంచి కూడా ఆదేశాలు వచ్చినట్లుగా సమాచారం. సీఎంతో పాటు కాంగ్రెస్ హైకమాండ్ నుంచి వస్తున్న ఆదేశాలతో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రులు రంగంలోకి దిగినట్టు ప్రచారం జరుగుతోంది.

ఎమ్మెల్యేలకు మంత్రి సీతక్క విందు..

హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు బుధవారం రాత్రి విందు ఏర్పాటు చేశారు. ఆమె ఆహ్వానం అందుకున్న ఎమ్మెల్యేలు, నేతలు ఆలోచనలో పడ్డారని, కొందరు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా విందుకు వెళ్లినట్టుగా సమాచారం. అయితే ఈ విందులో పార్టీపదవులు, నామినేటెడ్ పదవుల పరమైన ఎలాంటి చర్చ జరగనప్పటికి అధికారంలోకి వచ్చిన ఏడాది తరువాత మంత్రి సీతక్క విందు ఏర్పాటు చేయటంపై ఎమ్మెల్యేల్లో చర్చ జరిగినట్టు సమాచారం. ఎమంత్రి విందుకు పిలిచింది వాస్తవమే.. భోజనం చేసినం.. సంప్రదాయం ప్రకారం దుస్తులు కూడా పెట్టారు. అంతే రాజకీయాలు ఏం మాట్లాడుకోలేదు.' అని ఓ ఎమ్మెల్యే 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కాగా, విభేదాలు ఉన్న ఎమ్మెల్యేలు కూడా పరస్పరం అభివాదం చేసుకుని, మాట్లాడుకోవటం కాంగ్రెస్‌లో ఐక్యతకు ఈ విందు ఎంతో కొంత ఉపయోగపడుతుందనే అంచనాల్లో కాంగ్రెస్ అగ్రనేతలున్నారు. మరో మంత్రి కొండా సురేఖ కూడా త్వరలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు విందు ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్టు సమాచారం. మొత్తంగా అధిష్ఠానం ఆదేశాలతో రంగంలోకి దిగిన మంత్రులు ఎమ్మెల్యేలతో సత్సంబధాలు కొనసాగిస్తూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా అభ్యర్థుల ఎంపికతో పాటు విజయం వరకు ఐక్యంగా.. సమష్టిగా కృషి చేసేలా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రయత్నాలు చేస్తోంది. ఈ విందు రాజకీయాలు ఎంత వరకు విజయవంతమవుతాయోననే చర్చ కూడా జరుగుతోంది.

భర్త హత్యకు భార్య సుపారీ

- రెండేళ్లుగా విడిగా ఉంటున్న భార్యాభర్తలు
- కోపంతో భర్తను చంపించేందుకు ప్లాన్
- ముఠాగా ఏర్పడి రెక్కీ నిర్వహించిన నిందితులు
- బాధితుడికి బెదిరింపు కాల్‌తో బెడిసి కొట్టిన స్కెచ్
- భార్యతో పాటు నలుగురిని అరెస్టు చేసిన నర్సంపేట పోలీసులు

నర్సంపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భర్త హత్యకు భార్య సుపారీ ఇచ్చింది. గొడవలతో రెండేళ్లుగా విడిగా ఉంటున్న భర్త.. తనను పట్టించుకోవడం లేదని కోపం పెంచుకుని ఈ దారుణానికి ఒడిగట్టింది. వరంగల్ నగరంలో ఇటీవల డాక్టర్‌ను అతడి భార్య సుపారి ఇచ్చి హత్య చేయించిన సంఘటన మరువక ముందే ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న భర్తను హతమార్చేందుకు భార్య పన్నిన కుట్ర కలకలం రేపుతోంది. హత్యకు సుపారీ తీసుకున్న వారిలో ఒకరు అత్యాశతో బాధితుడికి బెదిరింపు కాల్ చేయడంతో ప్లాన్ బెడిసికొట్టి సూత్రధారులు, పాత్రధారులంతా కటకటాలపాలయ్యారు. ఈ ఘటన నర్సంపేట మండలంలో గురువారం వెలుగు చూసింది. నర్సంపేట ఎస్సై జి. అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..

నర్సంపేట మండలం ఆకులతండాకు చెందిన ధారావత్ సుమన్‌కు ఇదే మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన మంజులతో 2018లో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కూతురు ఉంది. సుమన్ హైదరాబాద్‌లోని ఐడీబీఎల్ బ్యాంకులో మేనేజర్ పనిచేస్తున్నాడు. అయితే భార్యాభర్తలు తరచూ గొడవపడడం, మనస్పర్ధలతో రెండేళ్ల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. పంచాయితీకి పిలిస్తే భర్త రావడం లేదని, కలిసి కాపురం చేయడం లేదన్న అక్కసుతో భర్తపై మంజుల కక్ష పెంచుకుంది. భర్తను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకుంది. పది రోజుల కిందట ఆకులతండాలోని తనకు దగ్గరి పరిచయస్తుడైన మూడు గోపితో హోలీ పండుగ లోపు తన భర్త హత్య చేయాలని, ఇందుకోసం ఎన్ని డబ్బులైనా ఇస్తానని మంజుల ఒప్పందం కుదుర్చుకుంది. ముందుగా ఖర్చుల కోసం రూ.30వేలు ముట్టచెప్పింది. దీంతో గోపి తనకు తెలిసిన క్యాబ్ డ్రైవర్లు మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన మల్లేష్, వరంగల్ జిల్లాలోని రాయపర్తికి చెందిన బానోత్ నరేష్, మంజులకు బావ వరుసైన ములుగు జిల్లా అన్నంపల్లికి చెందిన మోతీలాల్ ముఠాగా ఏర్పడ్డారు. సుమన్‌ను హత్య చేయడం కోసం మొదట హైదరాబాద్‌లో పని చేసే బ్యాంకు వద్ద ఆరా తీశారు. అతడు ఎప్పుడు వెళ్తాడు..? ఎప్పుడు ఇంటికి వస్తాడు..? అనే విషయాలపై రెక్కీ నిర్వహించి ఆ తర్వాత హతమార్చాలనుకున్నారు.

ఇలా హత్యకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న క్రమంలోనే ముఠాలోని ఒకరు బానోత్ నరేష్ డబ్బులు వసూలు చేయాలన్న అత్యాశతో సుమన్‌కు ఈ నెల 4న ఫోన్ చేశాడు. నువ్వు డబ్బులిస్తే నీకు సంబంధించిన ఒక ముఖ్యమైన విషయం చెబుతానని, లేదంటే నిన్ను చంపేస్తామంటూ బెదిరించాడు. కంగారు పడిన సుమన్ తనకు ఫోన్ చేసిన వ్యక్తి గురించి ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. ఈ నెల 9న నర్సంపేట పోలీసులకు జరిగిన విషయంపై ఫిర్యాదు చేశాడు. సుమన్‌కు చేసిన ఫోన్‌కాల్‌తో పోలీసులు బానోత్ నరేష్‌ను పట్టుకొని విచారించి హత్య కుట్రను ఛేదించారు. నరేష్ ద్వారా కుట్ర సూత్రధారి మంజుల, మూడు గోపి, మల్లేష్, మోతీలాల్‌ను బుధవారం అరెస్టు చేసి విచారించగా హత్య కుట్రను ఒప్పుకున్నారు. ఇదే రోజు రాత్రి నిందితులైన ఐదుగురిని కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ వివరించారు.

అనాథలకు అండగా..

- ఆశ్రయం కల్పిస్తున్న మాతృభూమి చారిటబుల్ ట్రస్టు
- పెంచి, చదివిస్తున్న నిర్వాహకులు
- ఇటీవల ఇద్దరు యువతులకు వివాహాలు
- ఆదర్శంగా నిలుస్తున్న మోహన్‌రావు దంపతులు


అనాథల ఆలనాపాలన చూస్తున్న డాక్టర్ మోహన్‌రావు, వినోద దంపతులు

నర్సంపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయస్సులోనే కన్న తల్లిదండ్రులను కోల్పోయి.. అయిన వారు లేక అనాథలైన ఇద్దరు చిన్నారులను చేరదీసి ఆశ్రయం కల్పించి.. తల్లిదండ్రుల్లా సాకి.. ఓనమాలు దిద్దించి.. ఉన్నత చదువులు చదివించి.. వారికి వివాహాలు చేసి.. ఆదర్శంగా నిలిచారు ఆ దంపతులు. నర్సంపేటలో మాతృభూమి ఛారిటబుల్ ట్రస్టు పేరుతో ఆశ్రమం ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు నర్సంపేట పట్టణానికి చెందిన డాక్టర్ అర్శనపెల్లి మోహన్‌రావు, వినోద దంపతులు. ఎస్ఆర్ఐ రవిచందర్ సహకారంతో పట్టణంలోని అంగడికి సమీపంలో 2006లో మాతృభూమి చారిటబుల్ ట్రస్టు అనాథాశ్రమాన్ని నెలకొల్పారు. మొదట వృద్ధులకు ఆశ్రయం కల్పించి చేరదీసిన నిర్వాహకులు ఆ తర్వాత అనారోగ్యంతోనో మరే ఇతర కారణాలతో తల్లిదండ్రులు మరణించడం, అయినవారు కూడా లేక అనాథలుగా మిగిలిన చిన్నారులను చేరదేసి పెంచడంతో పాటు వారికి అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆశ్రమంలోని అనేక మంది విద్యార్థులు బీటెక్, ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తున్నారు. కొందరు బీటెక్ పూర్తిచేసి ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు ట్రస్టు నిర్వాహకులు.

ఇద్దరి వివాహాలు చేసిన దంపతులు

అనాథలైన రోజా, నాగరాణిలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించిన మోహన్‌రావు, వినోద దంపతులు వారికంటూ ఓ జీవితాన్నిచ్చేందుకు ఈనెల 12న ఆదర్శ వివాహాన్ని దగ్గరుండి జరిపించారు. నర్సంపేట మండలం బోజ్యానాయక్‌తండాకు చెందిన పాపవత్ బిచ్చునాయక్, బుల్లెమ్మ దంపతులు మరణించడంతో వారి సంతానమైన 9ఏళ్ల రోజా ఆమె చెల్లెలు, సోదరుడికి 2007లో ఆశ్రయం కల్పించారు. 1వ తరగతి నుంచి బీటెక్ వరకు చదివించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో రోజా ఉద్యోగం సాధించింది. తన దూరపు బంధువులు చూసిన బోడ గణేష్‌తో వివాహం నిశ్చయం కావడంతో వారికి తమ సొంత ఖర్చులతో ట్రస్టు నిర్వాహకులే వివాహం జరిపించారు. అలాగే 2009లో ఆశ్రమంలో చేరిన చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి నాగరాణిని బీఎస్సీ వరకు చదివించగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో తాను ప్రేమించిన నర్సంపేట పట్టణానికి చెందిన నిమ్మల రాకేష్‌తో ఆదర్శ వివాహం జరిపించారు. ఈ క్రమంలో మోహన్‌రావు, వినోద దంపతులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సమాజంలోని ప్రతీ ఒక్కరు అనాథలకు అండగా నిలవాలన్నారు. తాము సంపాదించే దానిలో కొంత సమాజ సేవకు ఉపయోగించాలనే లక్ష్యంతోనే అనాథ యువతలకు అండగా ఉంటూ వారి వివాహాలను జరిపిస్తున్నామన్నారు.


యువతులు రోజా, నాగరాణి


పరీక్ష ప్యాడ్స్, స్టేషనరీ అందజేస్తున్న ఏసీపీ

భవిష్యత్‌కు ప్రణాళిక రూపొందించుకోవాలి

మట్టెవాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గౌరవప్రదమైన జీవితం గడపాలంటే వ్యక్తిగత క్రమశిక్షణ విద్యార్హతలు ముఖ్యమైనవని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అన్నారు. బుధవారం వరంగల్ మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మట్టెవాడ పోలీసుల ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్ష స్టేషనరీ, ప్యాడ్స్‌ను ఏసీపీ నందిరాం నాయక్, సీఐ గోపీతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నందిరాంనాయక్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో చేసుకునే అలవాట్లు, కట్టుబాట్లు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలపై నిలబెడతాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అనేక విద్యా సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాస్‌రావు, టీచర్లు అజయ్ బాబు, వి.కిరణ్, షౌకత్ అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాముల వారిని తాకిన సూర్యకిరణాలు


రాముల వారిపై ప్రసరిస్తున్న సూర్యకిరణాలు


శంభునిపేట, మార్చి13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శంభునిపేటలో గల చారిత్రాక శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో గురువారం గర్భాలయంలోని సీతారాముల విగ్రహాలను సూర్య కిరణాలు తాకాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు తిరుమల శ్రీధరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యేటా సూర్యకిరణాలు ఆలయ గర్భాలయాన్ని తగులుతాయని, అదే క్రమంలో గురువారం రాముల వారి పాదాలను తగిలాయని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి సీతారాములను దర్శించుకున్నారు.

నేడు సరస్వతీదేవికి వసంతోత్సవం


సరస్వతి అమ్మవారు

వరంగల్ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని భద్రకాళి ఆలయం రోడ్డులో గల శ్రీజ్ఞాన సరస్వతీ దేవి పీఠంనందు రెండు రోజుల పాటు వసంతోత్సవ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు శ్రీపాద పవన్‌శర్మ, నిర్వాహకులు చిట్టిమల్ల శ్రీనివాసరావులు తెలిపారు. పాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజల అనంతరం మహిళలచే కోలాటం, రంగులకు బదులు వివిధ రకాలపుష్పాలతో పుష్ప వర్షం, హోలీ వేడుకలు అనంతరం ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదం జరుగుతుందని గురువారం సాయంత్రం శ్రీచక్ర అర్చన, మంగళహారతులు నిర్వహించడం జరిగిందని, శుక్రవారం పౌర్ణమి వసంతోత్సవ వేడుకలు జరుగుతాయని తెలిపారు.

లక్ష మల్లెపూలతో అమ్మవారికి పూజలు


అమ్మవారికి మల్లెపూలతో అర్చన నిర్వహణ

వరంగల్ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంజీఎం సెంటర్‌లో గల శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి పాల్గుణ మాసం గురువారం లక్ష మల్లెపూలతో అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు లక్ష్మణ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో అమ్మవారికి లక్ష మల్లెపూల అర్చన నిర్వహించారు. సాయంత్రం పౌర్ణమి తిథి ప్రారంభం కావడంతో 108 పసుపు కొమ్ములతో తయారు చేసిన మాలలను అమ్మవారికి సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని శ్రీలలితాసహస్ర పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వొద్దిరాజు వెంకటేశ్వర్‌రావు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి సన్నిధిలో రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న రిటైర్డ్ డీసీ కుటుంబ సభ్యులు

వరంగల్ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారిని వరంగల్ జోన్ దేవాదాయ శాఖ రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ టి. రమేష్‌బాబు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన డీసీ దంపతులకు అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అర్చకులు రమేష్‌బాబు, కుటుంబ సభ్యులకు అందజేశారు.

పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలి

● రాష్ట్ర సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి

● రాష్ట్ర మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలని హైదరాబాద్ సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి రాష్ట్ర మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి తగు సూచనలు చేశారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడి పన్నుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. ఈ నెల మార్చి 31 వరకు పన్నుల వసూళ్లు వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి పన్నుల వసూలు చేయడంలో విజయం సాధించాలని అన్నారు. ప్రస్తుతం 25 శాతం రుసుములో తగ్గింపు ఉందని ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అంతే కాకుండా ఈ నెల ముగిసిన తర్వాత యథావిధంగా పన్నులు వసూలు చేయాలని, అప్పుడు ఎలాంటి తగ్గింపులు, సబ్సిడీలు ఉండవని అన్నారు.

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ఇప్పటి వరకు వరంగల్ నగరంలో పన్నులు వసూలు వేగవంతంగా జరుగుతోందన్నారు. సుదీర్ఘకాలం పాటు బల్దియాకు పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నామని అన్నారు. ఇండ్లు, షాపింగ్‌మాల్స్, రెసిడెన్షియల్ కాంపెక్స్‌ల యజమానులు పన్నులు చెల్లించకుంటే రెడ్ నోటీసులు ఇస్తారని, 48 గంటల్లో స్పందించకపోతే అక్కడి సామగ్రిని జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్దియా నుంచి డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో శానిటేషన్ పనులు సక్రమంగా నిర్వర్తించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు, సిబ్బందికి సూచించారు. గురువారం వరంగల్ నగరంలో 7వ డివిజన్‌లో శానిటేషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హనుమకొండ మెయిన్ రోడ్డు, బస్‌స్టాండ్ ప్రాంతంలో పర్యటిస్తూ రోడ్లు శుభ్రం చేస్తున్న శానిటేషన్ కార్మికులతో మాట్లాడారు. శానిటేషన్ పనులతో పాటు కార్మికుల సమస్యలు, బాగోగులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుధ్య సిబ్బంది గ్యాంగ్ వర్క్‌లు, రోడ్ల శుభ్రత, డ్రైనేజీ క్లీనింగ్ విధులకు హాజరవుతున్న సమయంలో తప్పకుండా ఇండ్ల యజమానులతో లాగ్‌బుక్‌లో సంతకాలు తీసుకోవాలని అన్నారు. అంతేకాకుండా వారి మొబైల్ నెంబర్ తీసుకోవాలన్నారు. స్వచ్ఛ ఆటో యజమానులు, డ్రైవర్లు పిన్‌పాయింట్ బుక్‌ను నిర్వహించాలని అన్నారు. అంతేకాకుండా చెత్త సేకరణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని లాగ్‌బుక్‌లో రాయాలని అన్నారు. కార్మికులు షెడ్యూల్ ప్రకారం చేస్తున్న పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు నిత్యం పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్‌తో పాటు జవాన్లు పాల్గొన్నారు.


టెలీకాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ

మార్కెట్ చార్జీలను వ్యాపారుల నుంచి వసూలు చేయాలి

వరంగల్ వ్యవసాయం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పంజాబ్, చండీగఢ్, హర్యానా రాష్ట్రాల వ్యవసాయ మార్కెట్లలో రైతు పంట సరుకుల దిగుమతి చార్జీలు తప్ప రైతుపై ఎలాంటి అదనపు భారం మోపడం లేదని, అదే మాదిరిగా తెలంగాణలో కూడా అమలు చేయాలని అందుకు చట్ట సవరణ చేయాలని తెలంగాణ రైతు సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ కొదండరామ్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మోర్తాల చందర్‌రావు ఆధ్వర్యంలో రైతు సంఘం ప్రతినిధులు గురువారం కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ.. మార్కెట్ చార్జీలైన హమాలీ, దడువాయి, అడ్తి కమీషన్, మునీం, కూటుకు కిలో లాంటి వన్నింటిని వ్యాపారుల నుంచి వసూలు చేయాలన్నారు. పంజాబ్, హర్యానా, చండీగఢ్ రాష్ట్రాలలో పై చార్జీలు ఏవీ రైతులనుంచి వసూలు చేయడం లేదని, అదే విధంగా మన రాష్ట్రంలో అమలు చేసేందుకు చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కోందడరామ్‌రెడ్డికి మెమోరాండం అందజేయగా ఆయన వెంటనే స్పందించి సీఎం దృష్టికి తీసుకువెళతానని రైతు సంఘం నాయకులకు హామీ ఇచ్చారు.

రైతును దడువాయి చార్జీల నుంచి మినహాయించాలి

వ్యవసాయ మార్కెట్లలో రైతు సరకులను తూకం వేసే దడువాయిలు రైతు నుంచే చార్జీలను వసూలు చేసి భారం మోపొద్దని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ గురువారం రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని సచివాలయంలో కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మార్కెట్లలో రైతుల సరుకులను తూకం వేసినందుకు దడువాయిలు బస్తాకు ఆరు రూపాయల చొప్పున రైతు నుంచి చార్జీలు వసూలు చేస్తున్నారని, దానిని నుంచి రైతులను మినహాయించాలని కోరారు. ఇప్పటికే రైతులు అనేక రకాలుగా నష్టపోతున్నారని వారిపై అదనపు భారం వేయవద్దన్నారు.


కోదండరెడ్డికి మెమోరాండం అందజేసిన శ్రీనివాస్

ఉన్నత స్థానాలను చేరుకోవాలి

ఖిలావరంగల్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాలలో రాణించిన బిల్ల శ్రావణి, వాసిరెడ్డి రమ్యారెడ్డిలు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావులు కోరారు. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌లుగా పని చేస్తున్న శ్రావణి, రమ్యారెడ్డిలను ఆయన గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన గ్రూప్-2ఫలితాలలో ఖిలావరంగల్ ప్రాంతానికి చెందిన శ్రావణి రాష్ట్రస్థాయిలో 126వ, ర్యాంక్, మహిళా కోటలో 6 ర్యాంక్‌ను సాధించిందన్నారు. రంగశాయిపేట, నాయుడు పంపు ప్రాంతానికి చెందిన వాసిరెడ్డి రమ్యారెడ్డి ఇటీవల వెలువడిన టీసీపీఎస్‌సీ-2023 ఫలితాలలో ఈసీఈ విభాగంలో రాష్ట్రస్థాయిలో 1వ ర్యాంక్‌ను సాధించి వరంగల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్ ఉద్యోగాన్ని సాధించిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గడ్డం రమేష్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు మిద్దెల కీర్తన్, ఆనంద్‌కుమార్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

37వ, డివిజన్ ఖిలావరంగల్ తూర్పు కోటలో శ్రావణిని వారి కుటుంబసభ్యులను సన్మానించారు. పెరికకుల సంఘం గ్రేటర్ వరంగల్ నాయకుడు అచ్చ వినోద్‌కుమార్ బిల్ల రవికుమార్(రాజు), కరుణాకర్, శ్రీనివాస్, రాకేష్, రాజు, క్రాంతి పాల్గొన్నారు.

ఆజంజాహీ మిల్స్ కార్మికులకు న్యాయం చేయాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు


తహసీల్దారుతో మాట్లాడుతున్న కార్మిక భవనం పరిరక్షణ సమితి శ్రేణులు

పోచమ్మమైదాన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి ఆజంజాహీ మిల్స్ కార్మికులకు తగిన న్యాయం చేయాలని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఏజేయం వర్కర్స్ యూనియన్, దళిత కార్మికులు దరఖాస్తు చేయగా విచారణలో భాగంగా గురువారం యూనియన్ శ్రేణులు, కార్మికభవనం పరిరక్షణ సమితి నాయకులు వరంగల్ తహసీల్దారు మహ్మద్ ఇక్బాల్‌ను కలిసి సమాచారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఎస్సీ కమిషన్ ద్వారా కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ వరంగల్ జిల్లా కన్వీనర్ గంగుల దయాకర్, కొనతం కృష్ణ, పెరుమాళ్ల లక్ష్మణ్, ఓకేనా వెంకటేశ్వర్లు, సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, పోలెపాక మార్టిన్‌లూథర్, సింగిరెడ్డి యశోద, బాస్కుల హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకోటలో కామదహనం

ఖిలావరంగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కామదహనంతో సమాజంలోని రుగ్మతలు(చెడు)పోయి ప్రజలకు అంతా మంచి జరగాలని కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్ అన్నారు. గురువారం 37వ డివిజన్ ఖిలావరంగల్ తూర్పుకోటలో కామదహన కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. హోలీ రంగులతో ప్రజల జీవితాలలో సుఖసంతోషాలు వెల్లివిరియాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తూర్పుకోట మహిళలు పోచమ్మదేవాలయంలో పూజలు చేశారు. అనంతరం కామదహనం చుట్టూ నీళ్లుపోసి ప్రదక్షిణలు చేశారు. ఈ కార్యక్రమంలో పోచమ్మ దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సిరబోయిన వాసుదేవ్, సిరబోయిన ఎల్లయ్య, సభ్యులు వీరస్వామి, ముడిదే లింగమూర్తి, అయిలయ్య, రమేష్, కృష్ణ, శ్రీనివాస్, వెంకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.


తూర్పుకోటలో కామదహనంలో పాల్గొన్న కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్, గ్రామపెద్దలు

18 కిలోల గంజాయి స్వాధీనం

వరంగల్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీ స్‌స్టేషన్ పరిధిలోని వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఇంతేజార్‌గంజ్ సీఐ మహ్మద్ అబ్దుల్ షుకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌ఐ సందీప్ సిబ్బందితో రైల్వే స్టేషన్ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇదే సమ యంలో మహారాష్ట్రకు చెందిన షేక్ సాదిక్, షేక్ మక్సూద్‌లు వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో రెండు బ్యాగులతో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు.ఈ క్రమంలో వారు పోలీస్ వాహనాన్ని చూసి పారిపోయే ప్రయత్నం చేయ గా పోలీసులు వారిని పట్టుకుని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న రెండు బ్యాగులలో రూ.తొమ్మిది లక్షల రూపాయల విలువ గల 18 కిలోల ఎండు గంజాయిని లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులిద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ షుకూర్ తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ, సిబ్బందిని సీఐ షుకూర్ అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 30 మందికి జరిమానా

మట్టెవాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 30 మంది వాహనదారులకు గురువారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. వరంగల్‌లో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా పట్టుబడిన 34 మంది వాహనదారులకు రూ. 3,24, 000 జరిమానా విధించారు. మద్యం తాగి వాహనం నడిపిన కేసులో వరంగల్ లేబర్ కాలనీకి చెందిన మేడిపల్లి జయప్రకాశ్, వరంగల్ రామన్నపేటకు చెందిన పాశికంటి సురేశ్‌లకు రెండురోజుల సామాజిక శిక్షతోపాటు జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఆరుగురికి రూ. 3900 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

కరీమాబాద్, మార్చి13,(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివనగర్‌లో గురువారం సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో శివనగర్ ప్రాంతానికి చెందిన కస్తూరి లలిత ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.33వేల విలువ గల 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన బియ్యాన్ని ఆమె కొనుగోలు చేసి నిల్వ చేస్తోందని, నిల్వ చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఆమెపై మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

చెన్నారావుపేట, మార్చి 13: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మగ్దుంపురం గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ ఇంట్లో రూ 60 వేల విలువ చేసే 24 క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని గ్రామానికి చెందిన కొమ్మ శివ, కిరణ్‌లపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు క్రాంతి, యాకన్న పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

కరీమాబాద్, మార్చి13, (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు మహిళా కవయిత్రి శ్రీ మొల్లమాంబ (కుమ్మరి మొల్ల) 585వ జయంతి వేడుకలను గురువారం ఉర్సు కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ జయంతి సందర్భంగా ఉర్సు ప్రాంతంలోని కుమ్మరి సంఘం భవనంలో మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుమ్మర కులంలో జన్మించిన మొల్లమాంబను స్మరించుకుంటూ ఆమె జీవిత చరిత్ర గురించి పలువురు మాట్లాడారు. అనంతరం పేద విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్‌లను అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆకారపు రాజగోపాల్ సంఘం బాధ్యులు ఆవునూరి భిక్షపతి, ఆకునూరి కుమారస్వామి, నాగరాజు, జగదీశ్వర్, రామన్న, రామ్మూర్తి, ఆనందం, రమేష్, చిన్నరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

● శంభునిపేట: శ్రీ శాలివాహన కుమ్మర డెవలమెంట్ వెల్ఫేర్ సొసైటీ రంగశాయిపేట, శంభునిపేట సంఘం ఆధ్వర్యంలో గురువారం తొలి తెలుగు కవయిత్రి శ్రీ మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆవునూరి రవి, కందికొండ మోహ న్‌లు మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యవర్గ సభ్యులు మొల్ల చిత్రపటానికి పూలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మొల్లరామాయణాన్ని రచించిన తొలి తెలుగు కవయిత్రగా మొల్లమాంబ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఆమె కుమ్మరి కులంలో పుట్టిన మహిళా ఆణిముత్యమని, ఆమె జీవన శైలిని ఆదర్శవంతంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారులు ఆవునూరి కుమారాస్వామి, ఆకారపు భిక్షపతి, కార్యవర్గ సభ్యులు ఆవునూరి రాజేష్, నాంపల్లి శ్రీను, దామోరుప్పల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుంట్ల కవిత పుట్టిన రోజు వేడుకలు

గిర్మాజిపేట, మార్చి13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, రాష్ట్ర శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత పుట్టిన రోజు వేడుకలు గురువారం కాశీబుగ్గలో నిర్వహించారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకురాలు నూకల రాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల కవిత ఫ్లెక్సీ ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానంతో పాటుగా వృద్ధులకు చీరెలు పంపిణీ చేశారు. అదే విధంగా తెలంగాణ ఉద్యమకారులు తాళ్ల ఉమా, ముస్కె ప్రమీల, పి.మంజుల, ఇక్బాల్, సుభాన్ తదితరులను సన్మానించారు. మాజీ కార్పొరేటర్ బి.స్వామి, జాగృతి నాయకులు ఎం.శ్రీదేవి, కె.రాహూల్, జి.చరణ్, పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో సన్మానం

ఖిలావరంగల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ వలబోజు మోహన్‌రావును లయన్స్‌క్లబ్ ఇంటర్‌నేషనల్ సభ్యులు గురువారం సన్మానించారు. 18వ, డివిజన్ లేబర్‌కాలనీలోని ఆయన క్లినిక్‌లో శాలువా, బోకేతో మోహన్‌రా వును సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఇంటర్‌నేషనల్ లయన్ ఈశ్వరయ్య, సభ్యులు ఆదినారాయణ, అల్లె లక్ష్మణ్, పెంట కుమార్ పాల్గొన్నారు.

డోర్నకల్ ప్యాసింజర్ రద్దు

గిర్మాజిపేట, మార్చి13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16 నుంచి 26 వరకు కాజీపేట - డోర్నకల్ - కాజీపేట (67765/67766), డోర్నకల్ - విజయవాడ - డోర్నకల్ ప్యాసింజర్ (67767/67768) రైలును ఆపరేషనల్ కారణాలతో రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ గురువారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ప్రయాణికుల సౌకర్యార్థం మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో నర్సాపూర్ - నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక హాల్టింగ్‌ను ఈనెల 16 నుంచి మరో ఆరునెలలపాటు పొడగించినట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌర సంబంధాల అధికారి గురువారం తెలిపారు.

చదువుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

● కలెక్టర్ సత్యశారద

● 333 మంది విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ

మామునూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థులకు వరంగల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేయించి ఉచితంగా కంటి అద్దాలను వరంగల్ కలెక్టరేట్‌లో డాక్టర్ సత్యశారద చేతుల మీదుగా గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు కంటి లోపం లేకుండా ఉండాలంటే సమీకృత ఆహారం తీసుకోవాలని, ఎక్కువగా పండ్లు, క్యారెట్స్ తీసుకుంటే ఆరోగ్యంతో పాటు చదువులో సులభంగా విజయం సాధించవచ్చునని అన్నారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.సాంబశివరావు మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో 36,368 మంది విద్యార్థులు ఉండగా అందులో 33,516 (92.36 శాతం) మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 1,024 మంది విద్యార్థులు దృష్టి లోపంతో బాధపడుతున్నారని గుర్తించి ఏరియా హాస్పిటల్స్ వర్ధన్నపేట, నర్సంపేట, రీజనల్ కంటి వైద్యశాలకు చెందిన నేత్ర వైద్యులతో పరీక్షలు చేస్తూ ఆన్‌లైన్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించగా వారిలో 333 మంది విద్యార్థులకు నవోదయ విద్యార్థులకు అందించినట్లు డాక్టర్ సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.నాగేశ్వర్‌రావు, అనిల్‌కుమార్, అధికారులు ప్రతాపగిరి ప్రసాద్, రాజేందర్, నవోదయ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సత్యశారద

అంబేద్కర్ అభయహస్తం పేరున బడ్జెట్‌ను కేటాయించాలి

ఖిలావరంగల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో అంబేద్కర్ అభయ హస్తం పేరుతో బడ్జెట్‌ను కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంగి ఏలేందర్ డిమాండ్ చేశారు. గురువారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో జన్ను రవి అధ్యక్షతన దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో భాగంగా దళిత బంధు స్థానంలో అంబేద్కర్ అభయహస్తం పేరున ప్రతీ దళిత కుటుంబానికి రూ.12లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చి 14 నెలలు గడుస్తున్నా అట్టి హామీని అమలుచేయడంలేదన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్యలు తక్షణమే సీఎం దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి తక్షణమే అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో 16న ఘన్‌పూర్‌లో సమావేశాన్ని అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో ఖిలావరంగల్ మండల కార్యదర్శి రాచర్ల రాజేందర్, మంద నవీన్, ఠాకూర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు సాంబయ్య మృతికి నివాళి

వరంగల్ వ్యవసాయం, మర్చి 13 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ వ్యవసాయ మార్కెట్లో గత నలభైఏళ్లకు పైగా బుల్లక్ కాట్స్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ యూనియన్ నాయుడిగా కొనసాగిన గడ్డమీది సాంబయ్య (73) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, గురువారం వరంగల్ వ్యవసాయ మార్కెట్లో బుల్లక్ కాట్స్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జన్ను స్వామి, ప్రధాన కార్యదర్శి బోసు ఆధ్వర్యంలో సాంబయ్య మృతికి సంతాపసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎస్‌రెడ్డి లింగారెడ్డి, కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, రాజేష్ డి కరాణీ, సాగర్ల శ్రీనివాస్, అల్లె సంపత్, గుమస్తాల సంఘం ప్రధాన కార్యదర్శి సులుగం వేణుగోపాల్ తదితరులు పాల్గొని సాంబయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శుక్రవారం
సా.. 6.31 గం॥
సహర్ : శనివారం
ఉ..5.02 గం॥


రంగులు చల్లే పైపులను కొనుగోలు చేస్తున్న చిన్నారులు

హోలీ ఆనందాలు తేవాలి..

నేడు రంగుల పండుగ

వాడవాడలా కామ దహనాలు

- సామగ్రి అమ్మకాలతో మార్కెట్లు కళకళ
- ఫాల్గుణ పౌర్ణమి వేళ ప్రత్యేక పూజలు, హోమాలు

6

వసంతరుతువు ఆగమనంతో వచ్చే ఆనందాల హోలీ పండుగకు అంతా సిద్ధమయ్యారు. చిన్నపెద్దా తేడా లేకుండా తమ అనుబంధాలను, ఆత్మీయతను, స్నేహాన్ని రంగులలో రంగరించి ఒకరిపై ఒకరు చల్లుకుని తమ జీవితాల్లో ఆనందాన్ని నింపాలని కోరుకోనున్నారు. గురువారం రాత్రి వాడవాడలా కాముడి దహనాలు నిర్వహించి.. శుక్రవారం రంగుల పండుగను జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక ఫాల్గుణ పౌర్ణమి వేళ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించనున్నారు. అలాగే హోలీ పర్వదినాన్ని సంతోషకరమైన రోజుగా భావించి చిన్నారులకు బహుమానంగా బిస్కెట్లతో తయారు చేసిన మాలలను అందజేస్తారు. ఈ హోలీ పండుగ రంగులు, పూజాసామగ్రి కొనుగోలుతో మార్కెట్లలో సందడి వాతావరణం కనిపించింది.

- వరంగల్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

మాయమాటలకు మోసపోవద్దు

ఫోన్‌ఇన్‌లో సందేహాలను నివృత్తి చేస్తున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్

- తెలియని యాప్‌లు, ఫోన్ కాల్స్, లింక్‌లకు స్పందించొద్దు
- సైబర్ క్రైం జరగగానే 1930 కాల్ చేయాలి
- స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కావాలి
- సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్

7

'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన





హస్తంలో.. ఐక్యత సాధ్యమేనా?

ఓరుగల్లు నేతల సఖ్యతపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి

- మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలను రూపుమాపే పనిలో పార్టీ పెద్దలు
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభావం ఉండొద్దంటూ సీఎం సూచన
- మంత్రి సీతక్క నివాసంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు విందు
- పరస్పర కుశల ప్రశ్నలు, పలకరింపులతో సాగిన భేటీ
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైన 'విందు రాజకీయం'

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

తొలి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య సఖ్యత అంతంతమాత్రమేనన్న విషయం అందరికీ తెలిసిందే. ఎమ్మెల్యేలు, మంత్రులు మధ్య విభేదాలు రచ్చకెక్కిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. నేతల మధ్య పెరిగిన ఈ దూరం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందనే ఆందోళనలో ఉన్న పార్టీ అధిష్ఠానం.. చొరవ తీసుకుని సఖ్యత కుదిర్చే పనిలో పడింది. ఈ నేపథ్యంలో మంత్రులే చొరవ తీసుకుని ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో సూచించినట్టు సమాచారం. దీంతో మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు హైదరాబాద్‌లో విందు ఇచ్చారు. ఇప్పుడీ విషయం ఓరుగల్లు పాలిటిక్స్‌లో చర్చనీయాంశమైంది. ఇలా ఓరుగల్లు కాంగ్రెస్ నేతల మధ్య ఐక్యత తేవడంపై అధిష్ఠానం దృష్టి పెట్టగా.. నేతల మధ్య ఐక్యతపై కొమ్మాలలో జరుగనున్న జాతర ప్రభ బండ్ల బల ప్రదర్శనతో స్పష్టత రానుందన్న చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అధిష్ఠానం ప్రయత్నాలు ఫలిస్తాయా? నేతల మధ్య ఐక్యత సాధ్యమవుతుందా? అన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది.

మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు..

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కొండా సురేఖ, సీతక్కలకు మంత్రులుగా అవకాశం లభించింది. వీరితో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రిగా నియమించారు. అయితే మొదటి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య గ్యాప్ తీవ్రంగా ఉంది. మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మధ్య రాజకీయ వైరం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. అంతేకాకుండా నామినేటెడ్ పదవుల విషయంలోనూ మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య వైరం ఏఐసీసీ వరకు వెళ్లింది. భద్రకాళి చెరువు పూడికతీత విషయంలోనూ ఓ మంత్రితో కొంతమంది ఎమ్మెల్యేలకు దూరం పెరిగిందనే టాక్ వినిపించింది. చివరకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒకరికి పదవి రాకుండా మరోకరు అధిష్ఠానం వద్ద ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వినిపించాయి. మొత్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య గ్యాప్ తీవ్రంగా ఉందనే విషయాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

ఎన్నికల్లో ప్రభావంపై ఆందోళన

ఉమ్మడి జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య పెరుగుతున్న దూరం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం పడే ఛాన్స్ ఉందని కాంగ్రెస్ అధిష్ఠానంతో పాటు శ్రేణులు కూడా ఆందోళనలో ఉన్నాయి. వరంగల్‌కు టెక్స్‌టైల్ పార్కు, ఐటీ సెక్టార్, ఎయిర్‌పోర్టు, భూగర్భ డ్రెయినేజీ తదితర వాటితో వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తుంటే.. నేతల మధ్య వచ్చిన గ్యాప్ క్యాడర్‌ను అయోమయానికి గురి చేస్తుందని అధిష్ఠానం భావిస్తోంది. టీపీసీసీలో పదవులతో పాటు

మిగతా 7వ పేజీలో...

కొమ్మాలలో బలప్రదర్శనకు రెడీ

కాంగ్రెస్‌లో ఐక్యతకు శుక్రవారం వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగే కొమ్మాల జాతరలో తేలనుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అనుచరులు ప్రభబండ్లు ఏర్పాటు చేస్తుండగా, వారికి దీటుగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ అనుచరులు భారీ ఎత్తున ప్రభబండ్లతో బలప్రదర్శనకు సిద్ధమవుతున్నా రనే చర్చ ఉంది. రేవూరి వర్గం నుంచి కొందరు కీలక నేతలు కొండా వర్గంలో చేరటంతో రెండు వర్గాల మధ్య వార్ ము దురుతోంది. దీంతో బందోబస్తుకు 500మందికి పైగా పోలీసులను మోహరించారు. ఇక్కడే జరిగే ప్రభబండ్ల ప్రదర్శన కాంగ్రెస్‌లో నేతల ఐక్యతపై ప్రభావం పడనుందనే చర్చ జరుగుతోంది.


బిషప్‌కు స్వాగతం పలుకుతున్న క్రైస్తవులు

ప్రపంచ శాంతికి ప్రతీ ఒక్కరు ప్రార్థించాలి

- క్రైస్తవులు ప్రార్థనా జీవితం గడపాలి
- వరంగల్ బిషప్ డాక్టర్ ఉడుమల బాల
- ముగిసిన ఫాతిమామాత మహోత్సవం
- భారీగా హాజరైన క్రైస్తవులు

7

దశదిన కర్మకు వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్ల మృతి
- ఐనపల్లి వద్ద టైరు పగిలి పల్టీ కొట్టిన కారు

ఖానాపురం/ఖిలా వరంగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కారు టైరు పగిలి పల్టీ కొట్టడంతో ఇద్దరు వృద్ధురాళ్లు మృతి చెందారు. ఈ సంఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని బుధరావుపేట శివారు ఐనపల్లి పెట్రోలు బంకు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి, బాధితుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా ఖిలావరంగల్ 37వ డివిజన్ తూర్పుకోట ప్రాంతానికి చెందిన అక్కాచెల్లెల్లు ఏసీరెడ్డి యశోద(80), బొలుగొడ్డు మాణిక్యమ్మ(78)లు వారి పిల్లలతో కలిసి మహబూబాబాద్ జిల్లాలోని కురవిలోని తమ బంధువు దశదిన కర్మకాండలకు కారులో వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో ఐనపల్లి శివారులోని హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద 365జాతీయ రహదారిపై కారు ముందు టైరు పగలిపోవండంతో అదుపు తప్పి కుడివైపునకు దూసుకెళ్లిన కారు పల్టీ కొట్టింది. దీంతో కారులో వెనుక సీటులో ఉన్న యశోద, మాణిక్యమ్మలు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. యశోద కుమారుడు రమేష్ కారు నడుపుతుండగా, మాణిక్యమ్మ కుమారుడు హరీష్, కూతురు అనితలు కారులోనే ఉన్నారు. స్వల్పగాయాలతో బయటపడ్డారు. రమేష్, హరీష్‌లు ఖిలావరంగల్‌లోనే ఉంటూ వ్యవసాయం, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. మృతురాలు యశోదకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మాణిక్యమ్మకు సైతం ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఖిలావరంగల్ తూర్పుకోటకు చెందిన బొలుగోడ్డు మాణిక్యమ్మకు భర్త మోహన్ గతంలో మృతి చెందారు.


యశోద (ఫైల్)


మాణిక్యమ్మ(ఫైల్)

మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. అలాగే ఏసీరెడ్డి యశోదకు భర్త జనార్ధన్‌తో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. దీంతో ఖిలావరంగల్ తూర్పుకోటలోని మృతుల కుటుంబసభ్యుల రోదనలతో వారి ఇళ్లలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజకీయ ప్రతినిధులతో సమావేశం పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19వ తేదీలోపు ఓటరు జాబితా సవరణ, ఇతర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆయన జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో 3 నెలలకోసారి పకడ్బందీగా అప్‌డేట్ కావాలని, నూతనంగా 18 ఏళ్లు పూర్తిచేసుకున్న ప్రతీ పౌరుడికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటరు జాబితా సవరణ, పోటీ చేసిన అభ్యర్థుల వివరాల సమర్పణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మినిట్స్ ఇతర అంశాలను ఈనెల 27లోపు ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధన ప్రారంభించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధనను ఈనెల 15 నుంచి ప్రారంభించాలని రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ డాక్టర్ యోగితారాణా తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి కమిషనర్ నర్సింహారెడ్డితో కలిసి కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా యోగితా రాణా మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష, తెలంగాణ విద్యాశాఖ మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమం (ఎఫ్ఎల్ఎన్)లో కృత్రిమ మేధను ఉపయోగించి బోధన మెరుగుపర్చనున్నట్లు తెలిపారు. ప్రతీ జిల్లా నుంచి నలుగురికి రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం వరంగల్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఎంపిక కాబడిన 11 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు, ఆయా పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖ అధికారులకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈనెల 15న ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్లాసులు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, డీఈవో జ్ఞానేశ్వర్, క్వాలిటీ కో ఆర్డినేటర్ సుజన్ తేజ తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద

కలెక్టర్ హోలీ శుభాకాంక్షలు

హోలీ పండగను ప్రజలు రాగద్వేషాలకు అతీతంగా జరుపుకోవాలని కలెక్టర్ సత్యశారద కోరారు. అందరి జీవితాల్లో సంతోషపు వెలుగులు నింపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సహజ రంగులను వినియోగిస్తూ హోలీ సంబరాలు జరుపుకోవాలని, జిల్లా ప్రజలకు కలెక్టర్ ఒక ప్రకటనలో హోలీ శుభాకాంక్షలు తెలిపారు.



ఆంధ్రజ్యోతి
WWW.ANDHRAJYOTHY.COM

వరంగల్ రూరల్

WARANGAL RURAL

శుక్రవారం 14 మార్చి 2025

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక పూట సెలవు ఇవ్వాలి

నర్సంపేట టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక పూట సెలవుతో పాటు మే నెలలో సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి కోరారు. టీహెచ్‌ఆర్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ నేతృత్వంలో ప్రతినిధి బృందం మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితారాంచంద్రన్, కమిషనర్ కాంతి వెస్లీలను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. నల్లా భారతి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మే నెలలలో అంగన్‌వాడీ టీచర్‌కు 15 రోజులు, ఆయాకు 15 రోజులు సెలవులు ఇస్తారని, కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. రమా తార, కోశాధికారి వేదవతి, ఎల్లమ్మ, రేణుక, రజిత తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ కాంతి వెస్లీకి వినతిపత్రం ఇస్తున్న నల్ల భారతి

పాఠశాలల్లో ముందస్తు హోలీ వేడుకలు



మంగళవారిపేట ప్రాథమిక పాఠశాలలో హోలీ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఖానాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు హోలీ వేడుకలను ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించారు. మంగళవారిపేట ప్రాథమిక పాఠశాల, నాజీతండా ప్రాథమిక పాఠశాల, మనుబోతులగడ్డ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన హోలీ వేడుకల్లో విద్యార్థులు రంగులు చల్లుకొని ఆనందంగా గడిపారు. కేరింతలు కొట్టారు.

● చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో ముందస్తుగా హోలీ పండుగ వేడుకలను ఘనంగా గురువారం నిర్వహించారు. విద్యార్థులు ఒకరి ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ ఆటలు ఆడారు. హోళి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అండెం కరుణాకర్‌రెడ్డి, మేడి రమేష్‌గౌడ్. కవిత, స్వప్న, కుండె రోజా, నవీన్, రమేష్, రాజుల తదితరులు పాల్గొన్నారు.

● పర్వతగిరి : మండలంలోని బూర్గుమల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి లింగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ వర్క్‌లను పరిశీలించారు. వారిని అభినందించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి సహకరించిన వారికి సన్మానం చేశారు. వివిధ తరగతులలో ఉన్నత ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

మండల సమాఖ్య భవనంలో..

రాయపర్తి : మండలకేంద్రంలోని స్వర్ణభారతి మండల సమైఖ్య భవనంలో మహిళా సంఘాల సభ్యులు ముందస్తుగా హోలీ వేడుకలు నిర్వహించారు. గురువారం ఈ వేడుకల్లో పాల్గొన్న ఏపీఎం కిరణ్ కుమార్ మాట్లాడుతూ హోలీ ప్రతీ ఒక్కరి ఇంటిలో ఆనందాన్ని తెచ్చి పెట్టాలని సూచించారు. మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భవిష్యత్తు తరాలకు అందేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు అనిత, దేవేంద్ర, వీవోఏలు వెంకన్న, బొమ్మెర మంగమ్మ, రమాదేవి, కరుణశ్రీ, యాకలక్ష్మి, శ్రీత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తిలో మండల సమాఖ్య భవనం వద్ద హోలీ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

13 మందితో కొమ్మాల జాతర ఉత్సవ కమిటీ

గీసుగొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : కొమ్మాల శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం 13 మందితో కూడిన ఉత్సవ కమిటీని నియమించింది. ఈ మేరకు గురువారం ఎండోమెంట్ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారు. ఉత్సవకమిటీ సభ్యులుగా కడారి రాజు, లావుడ్యా రాజన్న, కోల వేణు, కేలోతు జైత్‌రాం, మర్రి రాజలింగం, వాంకుడోతు సేవ్లా, లడే రాజేశ్వర్‌రావు, యండల నరేష్, ఇమ్మడి సమ్మయ్య, బోయపాటి శ్రీదేవి, యార రాజయ్య, నాగారపు సుమలతలు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

కొమ్మాల జాతర సందర్భంగా రవాణా మళ్లింపు

దుగ్గొండి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి గీసుగొండ మండలంలోని కొమ్మాలలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర సందర్భంగా ప్రయాణికులు, భక్తులకు ఇబ్బంది కలుగకుండా 15న రవాణా మళ్లింపు చేసినట్లు గురువారం ఎస్సై వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈనెల 15న జాతరకు ప్రభ బండ్లు వెళ్లుతున్నందున గిర్నిబావిలో ప్రయాణికులకు అంతరాయం, ట్రాఫిక్‌జామ్ కాకుండా వాహనాలు దారి మళ్లించడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. ప్రభబండ్ల సందర్భంగా డీజేలు వాడరాదన్నారు. హనుమకొండ నుంచి నర్సంపేట వైపు వెళ్లే వాహనాలు మచ్చాపూర్ నుంచి పల్లారుగూడ, మొండ్రాయి, కోనాపురం, చెన్నా రావుపేట నుంచి నర్సంపేటకు వెళ్లాలన్నారు. నర్సంపేట నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలు చెన్నారావుపేట, ఉప్పరపల్లి, పల్లారుగూడ, వరంగల్‌కు వెళ్లాలన్నారు. న ర్సంపేటకు వెళ్లే మోటర్ సైకిళ్లు, కార్లు మచ్చాపురం, ఎలుకుర్తి, లక్ష్మీపురం, పొనకల్, నాచినపల్లి తొగర్రాయి నుంచి నర్సంపేటకు, నర్సంపేట నుంచి కొమ్మాల జాతరకు వెళ్లే ప్రయాణికులకు గిర్నిబావి దగ్గర గల భారత్ పెట్రోల బంకు వద్ద బస్ స్టాప్‌పాయింట్ దగ్గర షటిల్ బస్సులు ఏర్పాటు చేసినట్లు ఎస్సై వెల్లడించారు, గిర్నిబావిలో ప్రభ బండ్ల ఊరేగింపు వరకు గిర్నిబావిలో మెడికల్ షాపుల తప్పా ఇతరషాపులు బంద్ పాటించాలిని ఎస్సై షాపు యజమానులను కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఖానాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన మానేపల్లి విజయ్‌కుమార్ (53) ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కాగా గురువారం నిర్వహించిన దశదినకర్మ సందర్భంగా విజయ్‌కుమార్‌తో కలిసి 1988-89విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ. 50వేల ఆర్థిక సహాయం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేసి పరామర్శించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లింగిడి వెంకటేశ్వర్లు, చిట్యాల దయాకర్, చెడిపాక ఉపేందర్, వేల్పుల లింగయ్య, శేరు శ్రీను, కొండ్లె భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ఖానాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుధరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ మోడల్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని గురువారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్లగౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తనయుడు దొంతి అవియుక్త్‌రెడ్డి ఆదేశాల అనుసారం విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పల్స ప్రశాంత్, బొల్లం హరీష్, కట్లోజు శివచారి, అక్రమ్, నాగరాజు, పాషా పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చెన్నారావుపేట, మార్చి 13: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మగ్దుంపురం గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ ఇంట్లో రూ 60 వేల విలువ చేసే 24 క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని గ్రామానికి చెందిన కొమ్మ శివ, కిరణ్‌లపై కేసు నమోదు చేసినట్లు టార్స్‌ఫోర్సు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు క్రాంతి, యాకన్న పాల్గొన్నారు.

మహేశ్వరంలో వ్యవసాయ రుణమేళా

నర్సంపేట టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రగతి ఇండస్ట్రీయల్ ఎస్టేట్ శాఖ, వ్యవసాయ రుణాల ప్రాసెసింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం వ్యవసాయ రుణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు రైతులకు బ్యాంక్ యొక్క స్కీమ్స్, వ్యవసాయ రుణాలపై అవగాహన కల్పించారు. బ్యాంక్‌ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండి మధుకర్‌గౌడ్, భూక్య రాజేష్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థినుల ఇబ్బందులు

● మూత్ర శాలలకు తాళం వేసిన సిబ్బంది



నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇంటర్ పరీక్షలు రాసి వస్తున్న బాలికలు

నెక్కొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రంలో మూత్రశాలలకు తాళాలు వేస్తుడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని విద్యార్థినులు, తల్లిదండ్రులు గురువారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ కళాశాలలో విద్యార్థినుల కోసం ఐదు మూత్రశాలలు ఉన్నాయి. వీటిలో రెండు మూత్రశాలలు ధ్వంసం కాగా, మూడు మూత్రశాలలు బాగానే ఉన్నప్పటికీ వాటికి తాళాలు వేస్తున్నారు. దీంతో బాలికలు తప్పని పరిస్థితుల్లో శిథిలావస్థలో ఉన్న మూత్రశాలలను ఉపయోగించాల్సి వస్తోంది. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు, వైద్యం, బాత్‌రూమ్స్ వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఉన్న మూత్రశాలలకు తాళం వేయడం ఎంత వరకు సమంజసమంటూ ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సంబంధితాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ కరుణశ్రీని వివరణ కోరగా అలాంటిది ఏమిలేదంటూ దాటవేశారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

పర్వతగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రానున్నది వేసవికాలం అయినందున గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి నీరజ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని గ్రామాల స్పెషల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో తాగునీరు, సాగునీరు, నర్సరీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పాడైపోయిన చేతిపంపులు, బోర్లను మరమ్మతు చేయించాలని సూచించారు. నర్సరీలలో మునగ, కరివేపాకు మొక్కల ను పెంచాలన్నారు. అనంతరం ఎంపీడీవో శంకర్ నాయక్ మాట్లాడుతూ గ్రామాల టార్గెట్ ప్రకారం కూలీలకు ఉపాధి హామీ పనులను కల్పించాలన్నారు. ఎంపీవో శ్రీనివాస్ మాట్లాడుతూ వంద శాతం ట్యాక్స్ కలెక్షన్ వసూలు చేయాలని ఉద్యోగులను ఆదేశించారు. ఎస్‌బీఎం పెండింగ్ ఉన్న మరుగుదొడ్లను పూర్తిచేయాలన్నారు.

ఎంసీపీఐ(యూ) ఎదుగుదల ఓర్వలేక ఆరోపణలు

నర్సంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఎంసీపీఐ(యూ) పార్టీ ఎదుగుదలను ఓర్వలేక పార్టీపై. పార్టీ నాయకులపై ఎంసీపీఐ పార్టీ నాయకులు అసత్యఆరోపణలు చేస్తున్నారని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్ అన్నారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో గురువారం నాగెల్లి కొమురయ్య అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుదపోరాట యోధుడు మద్దికాయల ఓంకార్, బీఎన్‌రెడ్డి పేర్లను ఉపయోగిస్తూ పార్టీ బహిష్కృత నాయకులు ఎంసీపీఐ పేరుతో చేస్తున్న అరాచకాలను చూస్తూ ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు. త్యాగాల పునాదులపై ఏర్పడ్డ ఎంసీపీఐ(యూ)ను విమర్శిస్తే సహించేది లేదని రాజాసాహెబ్ అన్నారు. కార్యక్రమంలో కుసుంబ బాబూరావు, వంగల రాగసుధ, రాజమౌళి, సింగతిమల్లికార్జున్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యం

జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ గౌతమ్ రెడ్డి

వర్ధన్నపేట రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం వేసవి కాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యమని వరంగల్ విద్యుత్ శాఖ ఎస్ఈ గౌతమ్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండలంలోని ఉప్పరపెల్లి సబ్ స్టేషన్‌లో ఫీడర్‌కు నూతన బ్రేకర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా సబ్ స్టేషన్‌లో ఒకటే ఫీడర్ ఉండడం వల్ల వ్యవసాయ బావులకు, గ్రామానికి వెళ్లే విద్యుత్ నిలిపివేయడంతో అంతరాయం ఏర్పడిందన్నారు. నూతన ఫీడర్ ద్వారా ఎల్‌సీ తీసుకోవడంలో గ్రామానికి, వ్యవసాయ బావులకు వేరువేరుగా సరఫరా అవుతుందని తెలిపారు. తద్వారా గ్రామాల్లోని నివాసాలకు విద్యుత్ అంతరాయం కలగదని స్పష్టం చేశారు. వ్యవసాయ బావుల వద్ద సైతం రైతులు మోటారుకు కెపాసిటర్‌ను అమర్చుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయని తెలిపారు. కెపాసిటర్లు వాడటం వల్ల డీటీఆర్ అధిక లోడు పడదని గుర్తు చేశారు. వచ్చే ఎండాకాలం సందర్భంగా రైతులు అధికారుల సూచనలు పాటించాలన్నారు. కరెంటు సరఫరాలో ఓల్టేజీ, హై ఓల్టేజీ వస్తుందని, ఆ సందర్భాల్లో కెపాసిటర్ పనిచేస్తుందని వివరించారు. వరంగల్ డీఈ భిక్షపతి, ఏడీఈ నటరాజ్, ఏఈ తరుణ్, సబ్ ఇంజనీర్ శివ, సిబ్బంది ఐలయ్య, ప్రవీణ్, లక్ష్మణ్, పంజా కృష్ణ పాల్గొన్నారు.



నూతన బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ గౌతమ్‌రెడ్డి

పాము కాటుకు గురైన వ్యక్తిని కాపాడిన ఎస్సై

నెక్కొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పనులు చేసుకుంటున్న రైతు పాముకాటుకు గురవడంతో చికిత్స కోసం పోలీసు వాహనంలో నర్సంపేటకు తరలించిన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. బొల్లికొండకు చెందిన రైతు బానోతు బాలాజీ వ్యవసాయ పనులు చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే చికిత్స కోసం 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా అందుబాటులో లేక పోవడంతో రైతు కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అయితే గ్రామానికి కేసు విచారణ నిమిత్తం వెళ్లిన ఎస్సై మహేందర్‌కు విషయం తెలువడంతో రైతును చికిత్స కోసం పోలీసు వాహనంలో నెక్కొండ పీహెచ్‌సీకి తీసుకురాగా ఆసుపత్రిలో పాముకాటుకు చికిత్స వ్యాక్సీన్ లేక పోవడంతో అతడి పోలీసు వాహనంలో నర్సంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. సహకాలంలో బాలాజీకి చికిత్స జరగడంతో ప్రాణాపాయం నుంచి బయట పడినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సైని మహేందర్‌ను పలువురు అభినందించారు.

వ్యవసాయ రంగానికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమేశ్

నర్సంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓంకార్‌భవన్‌లో గురువారం పార్టీ నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లా డుతూ కార్పోరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరిస్తుందని ఆయన విమర్శించారు. రైతులకు పూర్తి స్థాయిలో రూ:2లక్షల రుణమాఫీ చేయడంతో పాటు పత్తి,మిర్చి, మొక్క జొన్నలకు క్వింటాల్‌కు వెయ్యి చొప్పున బోనస్ అందించాలని తెలిపారు. ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌ఇస్మాయిల్, జిల్లా ప్రధానకార్యదర్శి బాబురావు, నాగెల్లి కొమురయ్య, నాగేశ్, మల్లికార్జున్, కేశెట్టి సదానందం, గోనె మహేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నుంచి పంటలను రక్షించుకోవాలి

దుగ్గొండి, మార్చి13 (ఆంధ్రజ్యోతి): పంటలకు ఆశించే చీడపీడల నుంచి పంటలను రక్షించుకోవాలని, దానికి వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని డీఏవో కె. అనురాధ సూచించారు. జాతీయ ఆహార భద్రత కింద మండలంలోని లక్ష్మీపురం, దుగ్గొండి, తొగర్రాయి, గిర్నిబావిలలోని మొక్కజొన్న, వరిపంటలను గురువారం సందర్శించి పరిశీలన చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ ప్రభావంతో పంటలకు వివిధ రకాల తెగుళ్ల సోకుతున్నాయని, వాటి నివారణకు తగు విధంగా మందులు పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న సాగు చేసిన 60 నుంచి 65 రోజుల్లో యూరియా, అదేవిధంగా మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేయాలన్నారు. సందర్శనలో జాతామ ఆహార భద్రత మిషన్ ఉమ్మడి జిల్లా బాధ్యుడు పి. సారంగం ఏఈవో లు హన్మంతు, విజయనాయక్, రైతులు పాల్గొన్నారు.

స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు అభినందనీయం



మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిరుద్యోగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమని దళిత నిరుద్యోగ సంక్షేమసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి అన్నారు. గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించి మాటా ఇచ్చి మడమ తిప్పని ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన, కల్పించబోతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్ధన్నపేట నియోజవర్గ అభివృద్ధి ప్రాదత కేఆర్ నాగరాజు చిత్ర పటాలకు ఈ నెల19న పాలభిషేకం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశమని అన్నారు. ఈ కృతాజ్ఞత సభకు ముఖ్య అతిథిలుగా మార్నేని రవీందర్‌రావు, నిమ్మని శేఖర్‌రావు, పసునూరి దయాకర్, ఎర్రబెల్లి స్వర్ణ, కేఆర్ దిలిప్‌రాజు, పలువురు జిల్లా ప్రముఖులు హాజరుకానున్నరని తెలిపారు.

మానవ అక్రమ రవాణాను నివారించాలి



మాట్లాడుతున్న సంగెం ఎస్సై నరేష్

సంగెం, మార్చి13(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సహకారం అందించాలని సంగెం ఎస్సై నరేష్ చెప్పారు. గురువారం మండల కేంద్రంలోని శాంతి మండల సమాఖ్య కేంద్రంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వీవోలు, వీవో అధ్యక్షులకు మానవ అక్రమణ రవాణాపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల పేదరికాన్ని ఆసరాగా చేసుకోని అమాయకపు నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళలను బాల బాలికలను ఉద్యోగ, ఉపాధి కలిపిస్తామని నమ్మబలికి మోసం చేస్తున్నారని అన్నారు. స్వయం సంఘాల్లోని మహిళలు జరుపుకునే మాసం వారి సమావేశంలో ప్రత్యేక ఎజెండాగా చర్చించుకోవాలని ఆయన సూచించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అవగాహన కల్పించేందుకు మహిళా సంఘాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కిషన్, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కళ్యాణి, రాజమణి, సీసీలు కుమారస్వామి, రాజయ్య, కృష్ణమూర్తి, సురేష్, ఏలియా, కార్యాలయ సిబ్బంది కృష్ణ, సుజాతలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కస్తూర్బాలో కంటి వైద్య శిబిరం

చెన్నారావుపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బాలో విద్యాలయంలోని విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే మొబైల్ హెల్త్ టీం వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, అద్దాలను అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భరత్‌రెడ్డి, డాక్టర్ స్వర్ణలత, ఫార్మసిస్ట్ స్మిత, ఏఎన్ఎం జూలేక, ఎస్‌వో.జ్యోతి, కావేరి, రక్షిత, హారిక, పల్లవి, హాసినీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా సువర్ణ

పర్వతగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పర్వతగిరి మండలం కాంగ్రెస్‌మహిళా అధ్యక్షురాలిగా మాసాని సువర్ణ భిక్షపతిని నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతా రావు, జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ సువర్ణకు గురువారం నియామకపత్రాన్ని అందజేశారు. మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన సువర్ణ వరుసగా రెండోసారి మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు.



సువర్ణ

కేశవాపురంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

దుగ్గొండి, మార్చి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవాపురంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలు రెండో రోజు వైభవంగా వేద పండితుల మంత్రాల మధ్య నిర్వహించారు. యాగశాలలో నిత్యఆరాధన, మహాకుంభస్థాపన, అగ్ని ప్రతిష్ఠ ధ్వజాధివాస, హవనాదులు, శేషవాహనోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఆలయ ధర్మాకర్త కంది జితేందర్‌రెడ్డి, సరళ, మోహన్‌రెడ్డి, కృష్ణవేణి, ఏవో కిరణ్‌లతో పాటు కేశవాపురం, పెంచికలపేట, లక్ష్మీపురం, నిరుకుళ్ల తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి దేవాలయంలో యాగశాలలో అగ్నిప్రతిష్ఠ పూజలు

మత్తు పదార్థాల వలలో పడొద్దు : ఎక్సైజ్ సీఐ

రాయపర్తి, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, యువత మత్తు పదార్థాల వలలో పడొద్దని, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎన్నో అనార్థాలు ఉన్నాయని వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప సూచించారు. మండలంలోని కొండూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం జెండర్ ఈ క్వాలిటీ గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాటు సారా, గుడుంబా నిర్మూలన కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐతో పాటు పలువురు మహిళను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొనతం పద్మలత, ఉపాధ్యాయులు శ్రీదేవి, అనిత, రాణి, సర్ణ, సత్యం, ఆచార్య, సత్యనారాయణ, శ్యాంసుందర్, శివకృష్ణ, స్వామి పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశంలో ప్రత్యేక చట్టం తీసుకరావాలి

సంగెం, మార్చి 13:(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ సమావేశంలో ప్రత్యేక చట్టం తీసుకవచ్చి మాదిగలకు న్యాయం చేయాలని ఎంఎస్‌పీ జాతీయ ఉద్యమ నేత మంద కుమార్ మాదిగ అన్నారు. మండల కేంద్రంలో గురువారం మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరహర దీక్షను ఆయన ప్రారంభించారు. జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ, నాయకులు గుండేటి లవకుమార్, బొజ్జ సురేష్ మాదిగ, కొలకనూరి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి : ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఏబీసీడీ వర్గీకరణ చేసి అమలు పరచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహర దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వశపాక కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఐత రాజు, కందికట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

● నెక్కొండ : ఎస్సీల వర్గీకరణ అనంతరం ఉద్యోగ నియమాకాలను చేపట్టాలని డిమాండ్ చేస్తు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నెక్కొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం రిలే దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఈదునూరి వెంకన్న మాట్లాడారు. నాయకులు బెరు కమలహాసన్, వీరస్వామి పాల్గొన్నారు.

● నర్సంపేట : అసెంబ్లీసమావేశంలో ఎస్సీవర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్, ప్రజాదండోరా జాతీయ అధ్యక్షుడు అందె రవి, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు గురువారం నాటికి మూడో రోజుకు చేరాయి. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ప్రజాదండోరా, ఎంఎస్ఎఫ్ నాయకులు కొలకలూరు నిరంజన్, మునిగె యాకూబ్, మాదాసి బాబు, గుండేటి వీరేశం, ఉప్పన్నరాజా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకుమార్ మాదిగ